

ఆదుకుంటే ఈ అమ్మ అనాథ కాదు

బిడ్డలకు జన్మనిచ్చి పెంచి ప్రయోజకులు చేసేంత వరకు తల్లి కడుపు కట్టుకుని బతుకుతుంది. కొంతమంది బిడ్డలు కన్నతల్లి రుణం తీర్చుకోడానికి వారిని జీవిత చరమాంకంలో నెత్తిన పెట్టుకుని చూస్తారు.కొందరు కఠిన హృదయులు మాత్రం తాము ప్రయోజకులయ్యాక అమ్మను నిర్దాక్షిణ్యంగా గాలికొదిలేస్తారు. కొందరైతే దుర్మార్గంగా దూర ప్రాంతం తీసుకువచ్చి మరీ వదిలేస్తున్నారు. చిత్తూరులోని గాంధీ సర్కిల్, దర్గా సర్కిల్, గిరింపేట, ఎంఎస్ఆర్ సర్కిల్, జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి వద్ద ఇలాంటి వృద్ధులెందరో దైన్యం నిండిన కళ్లతో తారసపడతారు. ఇదిగో వృద్ధురాలైన ఓ తల్లి ఇలాగే చిత్తూరు సంతపేట రోడ్డులో చాలాకాలంగా ఉంటోంది. ఎవరైనా ఏదైనా తినడానికిస్తే ఇష్టమైతే తీసుకుంటుంది. లేకపోతే లేదు.తిండి కూడా సరిగా లేకపోవడంతో నోటినుంచి మాట కూడా రావడం లేదు.మనసున్న వారు స్పందిస్తే ఆమెకు మళ్లీ ప్రాణభిక్ష పెట్టినవారవుతారు.

\- చిత్తూరు, ఆంధ్రజ్యోతి

అలజడి




తూపిలిపాళెం వద్ద ఎగిసిపడుతున్న కెరటాలు

బంగాళాఖాతంలో అల్పపీడన ప్రభావంతో తిరుపతి జిల్లా వాకాడు మండలం తూపిలిపాళెం తీరంలో సముద్ర కెరటాలు ఎగిసిపడుతున్నాయి. మంగళవారం తెల్లవారుజామునుంచి ఈదురుగాలుల తీవ్రత ఎక్కువగా ఉండటంతో అలలు ఒడ్డుకు వస్తున్నాయి. ఈదురుగాలులకు సముద్రం ఉప్పొంగుతోంది. ఉదయం నుంచి తేలికపాటి వర్షంతోపాటు మంచుతోడుకావడంతో ప్రజలు చలికి వణికిపోతున్నారు. మూడు రోజులపాటు భారీ వర్షాలు కురుస్తాయన్న వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో రైతులు, ప్రజలు అప్రమత్తమవుతున్నారు.

\- వాకాడు, ఆంధ్రజ్యోతి

నేడు సీఎం చంద్రబాబు రాక



తిరుపతి (నేరవి భాగం), నవంబరు 26(ఆంధ్ర జ్యోతి): చంద్రగిరి మండలం నారావారి పల్లెకు బుధవారం సాయంత్రం సీఎం చంద్రబాబు రానున్నారు. గురువారం జరిగే తన తమ్ముడు నారా రామ్మూర్తి నాయుడి వైకుంఠ సమారాధన కార్యక్రమంలో పాల్గొననున్నారు. అలాగే, మంత్రి నారా లోకేశ్ కూడా సాయంత్రం స్వగ్రామానికి రానున్నారు. ఇక, మంగళవారం మధ్యాహ్నం సీఎం సతీమణి నారా భువనేశ్వరి హైదరాబాదు నుంచి నారావారిపల్లెకు చేరుకున్నారు. నారావారిపల్లెలో గురువారం జరిగే కార్యక్రమానికి పలువురు మంత్రులు, డిప్యూటీ స్పీకరు, నేతలు, శ్రేణులు రానున్నారు. ఈ క్రమంలో పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు.

రేపట్నుంచీ తిరుచానూరు
పద్మావతీదేవి బ్రహ్మోత్సవాలు

నేడు లక్ష కుంకుమార్చన.. అంకురార్పణ

తిరుచానూరు, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): తిరుచానూరు పద్మావతీ దేవి కార్తీక బ్రహ్మోత్సవాలు గురువారం ప్రారంభం కానున్నాయి. డిసెంబరు 6వ తేది వరకు తొమ్మిది రోజుల పాటు జరిగే ఉత్సవాల్లో అమ్మవారు ఉదయం 8 గంటలకు, రాత్రి 7 గంటలకు వివిధ వాహనాలపై తిరుమాడ వీధుల్లో ఊరేగుతూ భక్తులకు దర్శనం ఇవ్వనున్నారు. ఉత్సవాలను పురస్కరించుకుని అమ్మవారి ఆలయంలోని శ్రీకృష్ణస్వామి ముఖమండపంలో బుధవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు లక్ష కుంకుమార్చనను నిర్వహించనున్నారు.ఈ సేవలో పాల్గొనదలచిన దంపతులు టికెట్ కొనుగోలు చేసి పాల్గొనవచ్చు. ఇక, బ్రహ్మోత్సవాలు ప్రారంభ సూచికగా బుధవారం సాయంత్రం అమ్మవారి ఆలయంలో అంకురార్పణ నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా అమ్మవారిని తిరుచ్చిపై.. వెంట సర్వసేనాధిపతి విష్వక్సేనుడిని ఉద్యానవనానికి వేంచేపు చేస్తారు. అక్కడ పుట్టమట్టిని సేకరించి తిరిగి ఊరేగింపుగా ఆలయంలోని యాగశాలకు చేరుకుని అంకురార్పణ ఘట్టానికి శ్రీకారం చుడతారు. సాయంత్రం 6 నుంచి 8.30 గంటల వరకు ఈ కార్యక్రమం జరుగుతుంది. గురువారం ఉదయం 9 నుంచి 9.30 గంటల మధ్య ధనుర్లగ్నంలో ధ్వజారోహణం జరుగుతుంది.మధ్యాహ్నం 3 గంటలకు దేవదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి తిరుచానూరుకు చేరుకుని రాష్ట్ర ప్రభుత్వం తరపున అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పిస్తారు.ఈ ఉత్సవాలను పురస్కరించుకుని ఆలయంలో జరిగే అన్ని ఆర్జిత సేవలను పది రోజులపాటు రద్దు చేశారు.

వాహన సేవలిలా: గురువారంఉదయం ధ్వజారోహణం, సాయంత్రం చిన్నశేషవాహనం, 29న ఉదయం పెద్దశేషవాహనం, సాయంత్రం హంసవాహనం, 30న ముత్యపుపందిరి, సింహ, డిసెంబరు 1న కల్పవృక్ష, హనుమంత, 2న పల్లకీ ఉత్సవం, సాయంత్రం 4 గంటలకు వసంతోత్సవం, రాత్రి గజవాహనం, 3న సర్వభూపాల, సాయంత్రం స్వర్ణరథోత్సవం, రాత్రి గరుడ, 4న సూర్యప్రభ, చంద్రప్రభ, 5న రథోత్సవం, అశ్వవాహనం, 6న మధ్యాహ్నం 12.15 గంటలకు పంచమి తీర్థం, రాత్రి 9.30 గంటలకు ధ్వజావరోహణం, 7న పుష్పయాగం.

కిలో టమోటా రూ.43.40

పుంగనూరు, నవంబరు 26(ఆంధ్రజ్యోతి):టమోటా ధర పెరిగింది. పుంగనూరు వ్యవసాయ మార్కెట్ యార్డులో మంగళవారం మొదటి రకం టమోటా కిలో రూ.43.40 ధర పలికింది. మార్కెట్‌కు వివిధ ప్రాంతాల నుంచి 45.15 మెట్రిక్ టన్నుల టమోటాలు రైతులు తీసుకురాగా నాణ్యతను బట్టి మొదటిరకం కిలో రూ.43.40, రెండోరకం రూ.40, మూడోరకం రూ.36.70 చొప్పన ధరలతో వ్యాపారులు టమోటాను కొనుగోలు చేసి డిమాండ్ ఉన్న ప్రాంతాలకు తరలించారు.

పలమనేరు పట్టణంలో తాగునీటి ఎద్దడి మొదలైంది. 13వేలకు పైగా గృహాలున్న మున్సిపాలిటీలో దాదాపు 58 వేలమంది నివసిస్తున్నారు.చేతి పంపులు దాదాపు 110 వరకు ఉండగా మూడోవంతు మాత్రమే పనిచేస్తున్నాయి. రోజుకు కనీసం 3.2 ఎంఎల్‌డీ నీరు అవసరముండగా ప్రస్తుతమున్న 88 బోర్లద్వారా 2ఎంఎల్‌టీల నీరు మాత్రమే సరఫరా అవుతోంది.దీంతో రోజు మార్చి రోజు కొన్ని ప్రాంతాల్లో ,మూడు నాలుగు రోజులకు ఒకసారి కొన్ని ప్రాంతాల్లో నీటిని సరఫరా చేస్తున్నారు. దీంతో గృహస్థులు నీటిని కొనుగోలు చేయక తప్పడం లేదు. ఒక్కోట్యాంకరు రూ. 500 పలుకుతుండడంతో కొనలేక ఇబ్బంది పడుతున్నారు.

దాహం.. దాహం

పలమనేరుకు ముంచుకొస్తున్న తాగునీటి సమస్య



నీటి జాడే లేని కౌండిన్య నది



ఫిబ్రవరి నెలాఖరుకే కౌండిన్య రిజర్వాయర్ పరిస్థితి ఇదీ



పలమనేరులో ట్యాంకరు ద్వారా నీటి అమ్మకాలు

పలమనేరు మండలంలో గత ఏడాది జూన్ నెల నుంచి వర్షాలు నామమాత్రంగా కురిశాయి. గత సంవత్సరం అక్టోబరు, నవంబరు మాసాల్లో తుఫాను సందర్భంగా కూడా వర్షాలు పెద్దగా కురవలేదు. ఇక ఈ ఏడాది పరిశీలించినా జూన్ నెలలో వర్షాలు నామమాత్రంగానే కురిశాయి. చెరువులకు చుక్కనీరు చేరని పరిస్థితి.

అటకెక్కిన అనుబంధ రిజర్వాయర్

కౌండిన్య నదిలో నీటి ప్రవాహం లేని పక్షంలో పలమనేరుకు తాగునీటి సమస్య తీవ్రరూపం దాల్చే అవకాశం వుందని అధికారులు భావించారు. అందుకోసం కౌండిన్య రిజర్వాయర్‌కు అటవీ ప్రాంతంలో ఉన్న గంగన్న శిరస్సు జలపాతం నుంచి పంపింగ్ ద్వారా నీటిని మళ్లించేందుకు అనుబంధ రిజర్వాయర్ నిర్మించాలని దశాబ్దకాలంగా ప్రతిపాదనలు చేస్తూనే ఉన్నారు. ఈ రిజర్వాయర్ నిర్మాణానికి కావలసిన భూములను కూడా రైతుల నుంచి సేకరించడం జరిగింది.గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ఈ అనుబంధ రిజర్వాయర్ గురించి పట్టించుకున్న నాథుడే కరువయ్యాడు.టీడీపీ అధికారం లోకి రావడంతో ఎమ్మెల్యే అమరనాథరెడ్డి ఈ రిజర్వాయర్ నిర్మాణానికి గట్టిగా కృషి చేస్తున్నారని టీడీపీ నాయకులు చెబుతున్నారు.తాగునీటి సమస్య విషయమై మున్సిపల్ కమిషనర్ రమణారెడ్డిని సంప్రదించగా ఇప్పటికే 8చోట్ల బోర్లు వేసి నీటిని సరఫరా చేస్తున్నామని, మరికొన్ని చోట్ల బోర్లు వేసి నీటిని సరఫరా చేసేందుకు జిల్లా అధికారులకు ప్రతిపాదనలు పంపించామని తెలిపారు.పలమనేరు మున్సిపాలిటీలో ఉన్న రెండు ట్యాంకర్ల ద్వారా సంపులకు సరఫరా చేసి అక్కడి నుంచి నీటిని సరఫరా చేస్తున్నామని తెలిపారు. కౌండిన్య ఎగువ ప్రాంతాల్లో వర్షాలు కురవక పోవడంతో రిజర్వాయర్ జలకళ కోల్పోయిందన్నారు.

\- పలమనేరు, ఆంధ్రజ్యోతి

ఫిబ్రవరిలోనే ఒట్టిపోయిన రిజర్వాయర్

పలమనేరుకు కాలువపల్లి వద్ద కౌండిన్య నదిపై నిర్మించిన రిజర్వాయర్ ద్వారా నీరందుతుంది.ఈ రిజర్వాయర్ నిండితే పట్టణానికి దాదాపు రెండేళ్లపాటు తాగునీరు సరఫరా అవుతుంది.2022లో రిజర్వాయర్ నిండినా తర్వాత వర్షాలు సక్రమంగా కురవకపోవడంతో ఈ ఏడాది ఫిబ్రవరి నెలకే రిజర్వాయర్ పూర్తిగా ఒట్టిపోయింది. దీంతో పట్టణానికి తాగునీటి సరఫరా ఈ రిజర్వాయర్ నుంచి పూర్తిగా నిలిచిపోయింది. దీంతో మున్సిపల్ అధికారులు వేసవిలో దాదాపు నాలుగునెలలు ట్యాంకర్లద్వారా తాగునీటిని సంపులకు నింపి సరఫరా చేస్తూ వచ్చారు. అయితే ప్రైవేటు ట్యాంకర్లకు నాలుగునెలల బిల్లులు చెల్లించక పోవడంతో వాటిని నిలిపి వేశారు. గత ప్రభుత్వంలో ఈ బిల్లులు పేరుకుపోవడంతో ట్యాంకర్ల యజమానులు ఆ బకాయిలు చెల్లిస్తేగానీ మళ్లీ నీటిని సరఫరా చేయలేమని చేతులెత్తేశారు.

కుప్పంలో ఇక వర్చువల్ పాలన!

- మండల మీట్‌తో నేడు ప్రారంభం
- ఎంపీడీవో సాయి లహరి సంకల్పంతో సాకారం



ఎంపీడీవో ఛాంబర్ పక్కనే ఏర్పాటు చేసిన 'వయా' గది

కుప్పం, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): 'టెక్నాలజీని మ్యాగ్జిమమ్ అంది పుచ్చుకోండి. అందుబాటులో ఉన్న సాంకేతికతను వినియోగించుకుని పాలనను సులభతరం చేయండి.' ముఖ్యమంత్రి చంద్రబాబు పదేపదే అధికారులకు ఇచ్చే సందేశమిది. ఈ సందేశాన్ని కుప్పం యువ ఎంపీడీవో సాయి లహరి అందిపుచ్చుకుంది.వర్చువల్ ఇంటరాక్షన్ ఏరియా (వయా) అనే వినూత్నమైన ఆలోచనను అమల్లోకి తేవడానికి నడుం బిగించింది. కలెక్టర్ సుమిత్ కుమార్ అనుమతి తీసుకుని కంప్యూటర్ గదిగా వాడుతున్న గదిని ఖాళీ చేయించారు. ఇద్దరు యువ టెక్నీషియన్ల సాయంతో అవసరమైన టెక్నాలజీని ఆ గదిలో డెవలప్ చేశారు.నాలుగు నెలల కాలంలో వర్చువల్ ఇంటరాక్షన్ ఏరియాను తన ఆలోచనలకు అనుగుణంగా తీర్చిదిద్దారు.ఈ గదికి అనుసంధానమయ్యే పంచాయతీ కార్యాలయాల్లో కూడా అందుకు అనువైన ఏర్పాట్లు చేయించారు. మొత్తం 31పంచాయతీలకు గానూ 21 పంచాయతీల్లో సీసీ టీవీలు, సీసీ కెమెరాలు ఏర్పాటు చేయించారు. వెబ్ కామ్స్ బిగింపజేశారు. వయా గదినుంచి బార్ కోడ్స్ ద్వారా ఆయా కార్యాలయాలకు అనుసంధానమయ్యే ప్రక్రియకు అవసరమైన టెక్నాలజీని డెవలప్ చేయించారు. ఈ వర్చువల్ ఇంటరాక్షన్ ఏరియా ద్వారా బుధవారం వర్చువల్ పద్ధతిలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించడానికి సర్వం సిద్ధమైంది. ఉదయం 10.30 గంటలకు సాధారణమైన పద్ధతిలోనే మండల సర్వసభ్య సమావేశం ప్రారంభమవుతుంది. సుమారు గంట గంటన్నర అయ్యాక, వర్చువల్‌గా మండల మీట్ జరిపించడానికి నిర్ణయించారు.అంటే మండల పరిషత్తు కార్యాలయంలోని ఆ చిన్నగదినుంచే ప్రత్యేకమైన సాంకేతిక పద్ధతులను ఉపయోగించి, డిస్‌ప్లే ప్యాడ్, కెమెరాల ద్వారా మండలంలోని మొత్తం పంచాయతీ కార్యాలయాలతో అనుసంధానమవుతారు. గూగుల్ మీట్ ద్వారా జాయిన్ అవుతారు. ఆ కార్యాలయంలో సిద్ధంగా ఉండే పంచాయతీ కార్యదర్శులు, సర్పంచ్‌లతో ఇక్కడినుంచే ఎవరైనా సరే ఇంటరాక్షన్ కావచ్చు.భవిష్యత్తులో మండల కార్యాలయానికి రాకుండానే ఆయా పంచాయతీ కార్యాలయాలనుంచే వర్చువల్‌గా మండల్ మీట్‌లో పాల్గొనే సౌలభ్యం లభిస్తుంది.

'వయా'తో పారదర్శక పాలన

వయా ద్వారా పాలనలో వందశాతం పారదర్శకత తీసుకు రావడానికి వీలవుతుంది.మండల కార్యాలయంలోని వయా గదిలో కూర్చుని అక్కడున్న కెమెరాలు, ప్రత్యేకమైన వర్చువల్ ప్యానెల్ ఆపరేట్ చేయడం ద్వారా మండల పరిషత్తు పరిధిలోని ప్రభుత్వ శాఖల సిబ్బంది పనితీరును మానిటర్ చేసే వీలుంటుంది. సిబ్బంది దగ్గర మొబైల్ ఫోన్లుంటే చాలు, ఏ మూలనుంచైనా 'వయా' ద్వారా వారితో అనుసంధానం కావచ్చు.ఉదాహరణకు ఓ మారుమూల గ్రామంలో ఉపాధి పనులు జరుగుతుంటే ఫీల్డ్ అసిస్టెంట్ అక్కడికి వెళ్లి పని జరుగుతున్న తీరును వయా ద్వారా వర్చువల్‌గా మండల కార్యాలయంలోని ఎంపీడీవోకు చూపించవచ్చు.ముఖ్యమంత్రి చంద్రబాబు నియోజకవర్గం కావడంతో పలు సర్వేలు, అభివృద్ధి పనులు, మీటింగులు జరుగుతుంటాయి. ప్రోటోకాల్ డ్యూటీలు అదనం. అందువల్ల ఎంపీడీవో కానీ, కడా పీడీ కానీ స్వయంగా పంచాయతీలు మొత్తం తిరిగే వీలు చాలాసార్లు ఉండకపోవచ్చు. అటువంటప్పుడు ఈ వయా ద్వారా వర్చువల్‌గా ఆయా పనులు చక్కబెట్టే వీలవుతుంది. ఇదేవిధంగా ఆర్‌డబ్ల్యుఎస్, పంచాయతీ రాజ్ రోడ్లు తదితర పనులను కూడా మండల కార్యాలయంలో వయా గదినుంచే మానిటర్ చేయవచ్చు. పంచాయతీ కార్యాలయాలను 24 గంటలపాటు వర్చువల్‌గా ఎప్పుడైనా, ఎక్కడినుంచైనా వీక్షించగలిగే, అక్కడ జరుగుతున్న కార్యకలాపాలను గమనించగలిగే సదవకాశం ఉన్నతాధికారులకు లభిస్తుంది.

సీఎం ఆశయాలకు అనుగుణంగా



పాలనలో పారదర్శకత తీసుకురావాలన్న ముఖ్యమంత్రి చంద్రబాబు ఆశయాలకు అనుగుణంగానే ఈ వర్చువల్ ఇంటరాక్షన్ ఏరియా అనే ఆలోచన చేశాం. ఒక మండల పరిధిలో పూర్తిస్థాయి వర్చువల్ విధానంలో వంద శాతం పారదర్శక పాలన తీసుకు రావడం దేశంలోనే బహుశా మొదటి ప్రయత్నం కావొచ్చు.ఈ ప్రయత్నానికి సహాయ సహకారాలందించిన ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, ఆర్టీసీ వైస్ ఛైర్మన్ పీఎస్.మునిరత్నం, కడా పీడీ వికాస్ మర్మత్ బుధవారం ఈ వర్చువల్ మండల మీట్‌ను, వర్చువల్ ఇంటరాక్షన్ ఏరియా గదిని ప్రారంభిస్తారు - **ఎంపీడీవో సాయి లహరి**


టెన్త్ విద్యార్థులకు వర్చువల్ తరగతులు

కుప్పం మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న 10వ తరగతి విద్యార్థులకు వర్చువల్ తరగతులు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో సాయి లహరి తెలిపారు. మండల పరిషత్తు కార్యాలయంలో ఏర్పాటు చేసిన వయా ద్వారా ఈ తరగతులు తీసుకునే సౌలభ్యం ఉందన్నారు. రాబోయే పదో తరగతి పరీక్షలను దృష్టిలో ఉంచుకుని రోజువారీ ఆయా పాఠశాలల్లో బోధించే పాఠ్యాంశాలే కాకుండా ప్రత్యేకంగా నిపుణులైన ఉపాధ్యాయులతో వర్చువల్ తరగతులు నిర్వహిస్తామన్నారు. మండల పరిధిలో ప్రతి సబ్జెక్టుకు నిపుణులైన ఐదుగురు ఉపాధ్యాయులను ఎంఈవో సహకారంతో ఇప్పటికే ఎంపిక చేశామన్నారు. ఎంపిక చేసిన ఉపాధ్యాయులు 'వయా' గదికి వచ్చి, అక్కడున్న హై టెక్నాలజీ ప్యానల్ ద్వారా పాఠ్యాంశాలను బోధిస్తారని తెలియజేశారు. ప్రత్యేక తరగతులు ఆయా పాఠశాలల్లోని ఐఎఫ్‌పీ ప్యానళ్ల ద్వారా ప్రత్యక్ష ప్రసారంలో విద్యార్థులు చూసే వెసులుబాటు లభిస్తుందన్నారు. ఆయా పాఠ్యాంశాలలో విద్యార్థుల నైపుణ్యాలు మరింత పెరిగి, పరీక్షల్లో ఉత్తీర్ణత శాతం పెరగడానికి ఈ వర్చువల్ తరగతులు దోహదం చేస్తాయని ఎంపీడీవో సాయి లహరి విశ్వాసం వ్యక్తం చేశారు.

సాగర పోరాటం

సముద్రంతో పెనవేసుకున్న బంధం వారిది. చావైనా..బతుకైనా అక్కడే. పోరాటమూ సముద్రంతోనే, ప్రేమా సముద్రంతోనే. తిరుపతి జిల్లాలో 67 కిలోమీటర్ల పొడవైన సముద్రతీరంలోని 32 మత్స్యకార గ్రామాల ప్రజల జీవనశైలి భిన్నంగా ఉంటుంది.





మత్స్యకారులు అర్ధరాత్రి దాటగానే నిద్ర లేస్తారు. వలలు భుజాన వేసుకుని తీరానికి చేరు కుంటారు. ఒంటి గంటకంతా నాటుపడవల్లో సము ద్రంలోకి ప్రయాణం మొదలు పెడతారు. ఎగిసి దూకే అలలకు ఎదురేగుతారు. తీరం నుంచి దాదాపు 5 కిలోమీటర్ల దూరం దాకా సముద్రంలో ప్రయాణం చేస్తారు. చీకటి తెరల మాటునే వేట సాగిస్తారు. వలలకు చిక్కిన సంపదను పడవల్లో నింపుకుని వెనక్కి బయలుదేరుతారు. ఉదయం ఎనిమిదికల్లా తీరానికి చేరుకుని వలలు విప్పుతారు. ఆడ వాళ్లు అప్పటికే అక్కడకి చేరుకుని ఉంటారు. చేపా, రొయ్యా, ఎండ్రకాయ... దొరికినవి వేరు చేసుకుని అమ్ముకుంటారు. 4 వేల మంది రోజువారీ జీవనం ఇది. ఏటా దాదాపు అయిదు వేల టన్నుల మత్స్య సంపదను వీరు సముద్రం నుంచి సేకరిస్తున్నారు. వాకాడు మండలంలోని కొండూరుపాళెం, తూపిలిపాళెం మత్స్యకార గ్రామాల్లో 1800 కుటుంబాలు ఇదే జీవనంతో ఉన్నారు. వీరు పగలంతా తెగిన వలలు తిరిగి అల్లుకుంటూ గడుపుతారు. చదువుల మీద దృష్టి పెట్టరు. చిన్న వయసు నుంచే సముద్ర వేటకు బయలుదేరుతారు.



- వాకాడు, ఆంధ్రజ్యోతి



ఆడంబరాలూ.. అప్పులూ

వేట ద్వారా వేల రూపాయల ఆదాయం పొందుతున్నా.. వీరి దగ్గర ఎప్పుడు డబ్బులుండవు. వలలకూ, పడవల మరమ్మతులకూ భారీగా ఖర్చు అవుతుంది. వడ్డీకి అప్పుచేస్తారు. నోటిమాట మీద లక్షల అప్పు వీరికి ముడుతుంది. చేసిన కష్టమంతా తిరిగి అప్పుతీర్చడంలోనే కరిగిపోతుంది. ఊరి సంబరాలు ఆడంబరంగా నిర్వహిస్తారు. భారీగా ఖర్చు చేస్తారు. లక్షల అప్పు తెచ్చి మరీ వేడుకలు జరుపుకుంటారు. ఈ అప్పును ఇంటికింతని భరిస్తారు. అప్పులేని ఇల్లు మత్స్యకార గ్రామాల్లో దాదాపుగా ఉండదు.

పెద్దల మాటే శాసనం

మత్స్యకారులు ఒకే మాట మీద ఉంటారు. గ్రామ పెద్దలకు విలువ ఇస్తారు. పెద్దకాపు, నడిమికాపు, చిన్నకాపు అని గ్రామానికి ముగ్గురు పెద్దలుంటారు. వీరు చెప్పిందే తీర్పు. వీరి మాటే శాసనం. ఎవరూ అతిక్రమించరు. ఈ కట్టును దురాయి అంటారు. గొడవలు పడ్డా పోలీసుల దాకా వెళ్లరు.



గౌతమ్ అదానీని అరెస్ట్ చేయాలి

- ఆ అవినీతిలో భాగస్వామి అయిన మాజీ సీఎం జగన్ స్పందించాలి
- సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డిమాండ్



తిరుపతి (కలెక్టరేట్), నవంబరు26(ఆంధ్రజ్యోతి): 'అదానీని తక్షణమే అరెస్టు చేయాలి. ఆయనతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేసుకున్న విద్యుత్ ఒప్పందాలను రద్దు చేయాలి. ఆయనపై సీబీఐ, ఈడీ దర్యాప్తు జరిపించాలి' అని సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్ నర్సింగరావు డిమాండు చేశారు. కేంద్ర కార్మిక.. రైతు సంఘాల పిలుపు మేరకు మంగళవారం తిరుపతి కలెక్టరేట్ వద్ద వామపక్షాల ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. వీరికి పలు కార్మిక సంఘాలు సంఘీభావంగా ప్రకటించాయి. ఈ సందర్భంగా నర్సింగరావు మాట్లాడుతూ.. గౌతమ్ అదానీతో విద్యుత్ ఒప్పందాలు చేసుకున్న రాష్ట్రాలకు రూ.కోట్లలో లంచం ఇచ్చినట్లు అమెరికాలో కేసు నమోదైందని గుర్తుచేశారు. ఈ అవినీతి భాగస్వామిగా ఉన్న మాజీ సీఎం జగన్ దీనిపై స్పందించాలన్నారు. ఆయనా అవినీతిలో కూరుకుపోయారని పేర్కొన్నారు. దీనిపై కూటమి ప్రభుత్వం మాట్లాడకపోవడం సిగ్గుచేటన్నారు. ఆదానీతో చేసుకున్న ఒప్పందాలను కూటమి ప్రభుత్వం రద్దు చేయాలని కోరారు. కార్మికులకు కనీస వేతనం రూ.26వేలు ఇవ్వకుండా వెట్టిచాకిరీ చేయిస్తున్నారు. కార్మిక, కర్షక ప్రజా సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఏఐటీయూసీ, సీఐటీయూసీ జిల్లా అధ్యక్షులు ఎన్.చంద్రశేఖర్‌రెడ్డి, బాలసుబ్రహ్మణ్యం, ఐఎఫ్‌టీయూ నాయకురాలు భారతి డిమాండ్ చేశారు. అనంతరం కలెక్టర్ వెంకటేశ్వర్‌కి వినతిపత్రం అందజేశారు. ఈ ఆందోళనలో ఏపీ రైతు సంఘం నేత రామానాయుడు, సీపీఐ జిల్లా కార్యదర్శి పి.మురళి, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కందారపు మురళి, రైతు సంఘాల సమాఖ్య నాయకులు మాంగాటి గోపాల్‌రెడ్డి, వామపక్ష పార్టీ నేతలు రాధాకృష్ణ, విశ్వనాథ్, హేమలత, రవి, లక్ష్మి, జయచంద్ర, సుబ్రహ్మణ్యం, సాయిలక్ష్మి, ఐఎఫ్టీయూ కార్మిక సంఘ నేత వెంకటరత్నంతో పాటు వివిధ కార్మిక సంఘాల నాయకులు, రైతు నాయకులు పాల్గొన్నారు.



ఇళ్లమధ్యలో ఇసుక డంప్

తిరుపతి రూరల్ మండలం గాంధీపురం పంచాయతీ గరుడాద్రినగర్‌లో కొందరు ఇళ్లమధ్యలో ఇసుకను డంప్‌చేసి అనధికారికంగా విక్రయిస్తున్నారు. రోడ్డు పక్కనే చుట్టూ ప్రహరీ ఉన్న ఖాళీ స్థలంలో ఇసుక గుట్ట ఉంది. ఇక్కడ రేయింబవళ్లు ట్రాక్టర్లు, టిప్పర్ల రాకపోకలతో ఇబ్బందిపడుతున్నామని స్థానికులు అంటున్నారు. ఈ విషయాన్ని పంచాయతీ, రెవెన్యూ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేదని వాపోతున్నారు.

- తిరుపతిరూరల్, ఆంధ్రజ్యోతి

లాంఛనంగా పాఠశాల రాజ్యాంగం ఆమోదం

శ్రీకాళహస్తి, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తి మండలం ఊరందూరు జడ్పీ ఉన్నత పాఠశాల రాజ్యాంగాన్ని మంగళవారం లాంఛనంగా ఆమోదించారు. భారత రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా ఈ కార్యక్రమం జరిగింది. పాఠశాల రాజ్యాంగాన్ని ఇటీవల ఉపాధ్యాయులు, విద్యార్థులు కమిటీగా ఏర్పడి రచించిన విషయం తెలిసిందే.





కమిటీ అధ్యక్షురాలు రాజకుమారి ఆధ్వర్యాన రాజ్యాంగ పరిషత్ సమావేశం

పాఠశాల రాజ్యాంగ పరిషత్ అధ్యక్షురాలిగా హెచ్‌ఎం రాజకుమారి, రచనా సంఘం చైర్మన్‌గా కూనాటి సురేష్, హక్కుల కమిటీ చైర్మన్‌గా రమేష్‌బాబు, విధుల కమిటీ చైర్మన్‌గా శ్రీనివాసులు, అధికారాల కమిటీ చైర్మన్‌గా మురళి, విధి విధానాల చైర్మన్‌గా రజియా, మైనార్టీలు, వెనుకబడిన తరగతుల చైర్మన్‌గా మల్లికార్జున, ఆర్థిక కమిటీ చైర్మన్‌గా శాంతి, ఇతర కమిటీలకు చైర్మన్లుగా సుమతి, బిందు తదితరులు వ్యవహించారు. 193మంది విద్యార్థులు రాజ్యాంగ పరిషత్ సభ్యులుగా అలనాటి వస్త్రధారణలో హాజరయ్యారు. ముందుగా అధికారిక లాంఛనాలతో పాఠశాల రాజ్యాంగాన్ని ఆమోదించారు. అనంతరం ప్రధాన కమిటీ సభ్యులు ప్రతులను ఆవిష్కరించారు. ఆ తరువాత భారత రాజ్యాంగ వ్యవస్థపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. పాఠశాల రాజ్యాంగంలోని ప్రవేశికను సామూహికంగా ప్రతిజ్ఞ చేశారు. విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ, చిత్రలేఖనం, క్విజ్ పోటీలు నిర్వహించి ప్రోత్సాహక బహుమతులు అందించారు.

మన రాజ్యాంగం మహోన్నతం

తిరుపతి (కలెక్టరేట్), నవంబరు26(ఆంధ్రజ్యోతి): ప్రపంచంలో కెల్లా మన భారత రాజ్యాంగం మహోన్నతమైనదని కలెక్టర్ వెంకటేశ్వర్ పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ రాజ్యాంగ స్ఫూర్తిగా నడుచుకోవాలని, ఆ మార్గదర్శకాల మేరకు అధికారులూ సేవలు అందించాలన్నారు. కలెక్టరేట్‌లో మంగళవారం నిర్వహించిన భారత రాజ్యాంగ ప్రవేశిక ఆమోద దినాన్ని ఘనంగా నిర్వహించారు. ముందుగా భారత రాజ్యాంగ నిర్మాణ డాక్టర్ బాబాసాహెబ్ అంబేడ్కర్ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. రాజ్యాంగ ప్రవేశిక చదివి అందరితో కలెక్టర్ ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో జేసీ శుభం బన్సాల్, డీఆర్వో నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.



అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్



పంటను తొక్కించేశారు

ఇది 20 రోజుల కిందట నాటిన వరి పంట. చెరువు ఆక్రమిత పొలమని మంగళవారం ట్రాక్టరుతో తొక్కించేశారు. దొరవారిసత్రం మండలం వెదురుపట్టు పంచాయతీ నర్సమాంబపుర ఆగ్రహారం చెరువు సర్వే నెంబరు 43, 44లో ఐదు దశాబ్దాలుగా కొందరు రైతులు 20 ఎకరాల వరకు ఆక్రమించి సాగు చేసుకొంటున్నారు. వీటిని తొలగించాలని తుంగమడుగుకు చెందిన అధికార పార్టీ నాయకుడు రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో అధికారులు ట్రాక్టర్‌తో రోటా వేటర్‌తో తొక్కించేశారు. పంట వేయకముందే కట్టడి చేయలేదు. కనీసం పంట దిగుబడి వచ్చేవరకైనా ఆగుంటే బాగుండేదని స్థానికులు అంటున్నారు.

- దొరవారిసత్రం, ఆంధ్రజ్యోతి

మృతదేహం ఆనవాళ్ల లభ్యంపై
పోలీసుల దర్యాప్తు వేగవంతం

పాకాల, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): వ్యక్తి మిస్సింగ్ కేసులో ఆరు నెలల తరువాత మృతదేహం ఆనవాళ్లు లభ్యం కావడంపై పాకాల పోలీసులు దర్యాప్తు వేగవంతం చేశారు. సీఐ కె.మద్దయ్య ఆచారి మంగళవారం క్లూస్ టీం, ఫోరెనిక్స్ నిపుణులు, రెవెన్యూ సిబ్బందితో కలిసి మృతదేహం ఆనవాళ్లు లభ్యమైన ప్రాంతాన్ని పరిశీలించారు. ఉమర్ ఫరూఖ్ అవశేషాలను గుర్తించి ఫోరెనిక్స్ ల్యాబ్‌కు పంపించారు. 'ఉమర్ ఫరూఖ్ మే 4న రాత్రి ఎన్నికల నిమిత్తం లారీలో అక్రమంగా తెచ్చిన మద్యం దింపడానికి మరో ఇద్దరితో కలిసి వెళ్లాడు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులను చూసి పారిపోయాడు. పంటపల్లె దగ్గర కె.కిరణ్ కుమార్ రెడ్డి భూమిని మోహన్ రెడ్డి లీజుకు తీసుకొని సాగు చేస్తున్నాడు. మోహన్‌రెడ్డి పందుల కోసం పొలం దగ్గర కరెంటు తీగలను అమర్చాడు. పారిపోతున్న ఫరూఖ్ కాలికి కరెంటు తీగ తగలడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. మరుసటిరోజు ఉదయం మోహన్ రెడ్డి పొలంవద్ద ఫరూఖ్ మృతదేహాన్ని గుర్తించి భార్య సాయంతో సమీపంలోనే పూడ్చివేశారు' అని సీఐ వివరించారు. ఐడీ పార్టీ పోలీసుల ద్వారా ఘటన వివరాలు తెలియడంతో ఈ దారుణం వెలుగు చూసింది. మృతదేహాన్ని పూడ్చేసిన మోహన్ రెడ్డిని అదుపులోకి తీసుకొని పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



మృతదేహం ఆనవాళ్లు లభ్యమైన స్థలాన్ని పరిశీలిస్తున్న సీఐ మద్దయ్య ఆచారి

బేస్‌బాల్ టోర్నీ విజేతలు ఉమ్మడిజిల్లా బాలబాలికల జట్లు



ట్రోఫీలను అందుకుంటున్న బాలురు, బాలికల జట్లు



తిరుపతి(క్రీడలు), నవంబరు 26(ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి అండర్ 14 బేస్‌బాల్ విజేతలుగా ఉమ్మడి చిత్తూరుజిల్లా బాలబాలికల జట్లు నిలిచాయి. తిరుపతి శివారు మంగళంలోని ట్రెండ్స్ జడ్పీ ఉన్నత పాఠశాల మైదానంలో మూడు రోజులుగా బేస్‌బాల్ పోటీలు జరిగాయి. అత్యుత్తమంగా రాణించిన జట్లను విజేతలుగా ప్రకటించడంతో పాటు 32(బాలురు 16, బాలికలు 16)మంది క్రీడాకారులను జాతీయస్థాయి బేస్‌బాల్ పోటీలకు ఎంపిక చేశారు. మంగళవారం సాయంత్రం జరిగిన ముగింపు కార్యక్రమంలో టీడీపీ నేత మబ్బు దేవనారాయణరెడ్డి, ఎస్జీఎఫ్ జిల్లా కార్యదర్శి ఎస్.బాబు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు కేశవులనాయుడు, అనిత్‌కుమార్‌రెడ్డి విజేతలకు ట్రోఫీలు, బహుమతులు, సర్టిఫికెట్లు ప్రదానం చేశారు.

విజేతల వివరాలిలా

బాలుర విభాగం: ఉమ్మడి చిత్తూరుజిల్లా, విజయనగరం, వైఎస్సార్ కడప మొదటి మూడుస్థానాల్లో నిలిచాయి.

బాలికల విభాగం: తొలి మూడు స్థానాలను ఉమ్మడి చిత్తూరు జిల్లా, శ్రీకాకుళం, వైఎస్సార్ కడప జట్లు సాధించాయి.

జాతీయస్థాయి పోటీలకు ఎంపికైన వారు

బాలుర విభాగం: నవీన్‌కుమార్, కార్తీక్, అజిత్, తౌఫిక్(చిత్తూరు), పవన్, జోయల్, మోహన్‌కృష్ణ(విజయనగరం), బి.సంతోష్, ఎం.సంతోష్, కైఫ్(కడప), జస్వంత్(కృష్ణా), తులసీరాజ్(వైజాగ్), లోహిత్(అనంతపురం), వంశీ(శ్రీకాకుళం), చైతన్య(ప్రకాశం), వంశీ(కర్నూల్), స్టాండ్ బైగా గుణశ్యామ్(చిత్తూరు), జీవన్(వైజాగ్), హరినాథ్(కడప), గౌతం(విజయనగరం).

బాలికల విభాగం: రమ్య, శ్రీభవ్య, శ్రీహిమజ, నిరోష(చిత్తూరు), వినయలక్ష్మి, హరిణి, జీవిత(శ్రీకాకుళం), తనుజ, వైష్ణవి(కడప), మౌనిక(విజయనగరం), గాయత్రి(కృష్ణ), భూమి(గుంటూరు), హేమ(ఈ.గోదావరి), లావణ్య(అనంతపురం), అక్షయ(కర్నూల్), దీక్షిత(చిత్తూరు), స్టాండ్‌బైగా నాగశరణ్య(కడప), జయప్రసన్న(చిత్తూరు), రమ్య(విజయనగరం), కీర్తి(శ్రీకాకుళం).

వ్యాను, బస్సు ఢీ : 15మందికి గాయాలు





చికిత్స పొందుతున్న ఆంజనేయులు నాయక్, నవీన్



బాలుడిని చికిత్సకు తరలిస్తున్న దృశ్యం



దెబ్బతిన్న వ్యాను

శ్రీకాళహస్తి, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో 15మంది గాయపడ్డారు. ఈ ఘటన మంగళవారం వేకువజామున తొట్టంబేడు మండలం జ్ఞానాంబ కండ్రిగ సమీపంలోని నాయుడుపేట-రేణిగుంట జాతీయ రహదారిపై జరిగింది. శ్రీకాళహస్తి రెండో పట్టణ సీఐ వెంకటేశ్వర్లు తెలిపిన ప్రకారం.. పల్నాడు జిల్లా రెంటచింతల మండలం మల్లవరానికి చెందిన శ్రీనునాయక్ వ్యాపారి. ఆయన కుటుంబ సభ్యులతో కలిసి తిరుమల శ్రీవారిని దర్శించుకునేందుకు సోమవారం వ్యానులో బయలుదేరారు. జ్ఞానాంబ కండ్రిగ వద్ద బెంగళూరు నుంచి నాయుడుపేట వైపుగా వెళుతున్న టూరిస్టు బస్సు, వ్యాను ఢీకొన్నాయి. ఈ ఘటనలో వ్యానులో ప్రయాణిస్తున్న శ్రీనునాయక్, శ్రీరాములు, వెంకటేశ్వర్లు, సోమ్లు, సైదా, సంజు, జాను, ఆంజనేయులు, దద్దు, జశ్వంత్, మంజుల, రూప, నీల, వెంకటేశ్వర్లు, నవీన్ తదితరులు గాయపడ్డారు. ఇందులో అంజనేయులు ఎడమకన్నుకు తీవ్రగాయమైంది. ప్రథమ చికిత్స అనంతరం క్షతగాత్రులు తిరుపతి రుయాకు తరలివెళ్లారు. కేసు నమోదుచేసి దర్యాప్తుచేస్తున్నట్లు సీఐ వెంకటేశ్వర్లు తెలిపారు. అందరూ గాయాలతో బయటపడటంతో పెనుముప్పు తప్పిందని ఊపిరి పీల్చుకున్నారు.



12 అడుగుల కొండ చిలువ

కేవీబీపురం, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): కేవీబీపురం మండలం మారప్పరెడ్డి కండ్రిగ చెక్‌పోస్టు వద్ద మంగళవారం రాత్రి 12 అడుగుల కొండచిలువ కనిపించింది. ఆ సమయంలో విధుల్లో ఉన్న భోగరాజు, రఘుపతి దానిని చాకచక్యంగా పట్టుకుని సమీపంలోని అటవీప్రాంతంతో వదలిపెట్టారు.

ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగులకు ఊరట

పెన్షన్లలో కమ్యుటేషన్ రికవరీల ఆపివేతపై ఉత్తర్వులు

పుత్తూరు,నవంబరు 26(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని విశ్రాంత ఉద్యోగులకు ఊరట లభించింది.కమ్యుటేషన్ల రికవరీ కాలం 11 సంవత్సరాల మూడు నెలలు పూర్తయితే పెన్షన్లలో నవంబరు నెల నుంచి రికవరీని ఆపివేయాలని ప్రభుత్వం ఆదేశాలను జారీ చేసింది.గతంలో నిర్ణయించిన 15ఏళ్ల కాలంలో కమ్యుటేషన్ రికవరీలపై విశ్రాంత ఉద్యోగులు హైకోర్టును ఆశ్రయించి ఇంటీరియమ్ ఉత్తర్వులను పొందారు.1980లో బేసిక్ పెన్షన్‌లో 10.7 శాతానికి సమానంగా 40శాతం మొత్తాన్ని రిటైరయ్యే సమయంలో తీసుకుని 15 ఏళ్లలో ప్రభుత్వానికి చెల్లించేవారు. అయితే 2010లో 9వ పే కమిషన్ భారీగా జీతాలను పెంచడంతో బేసిక్ పెన్షన్‌లో 8.4 శాతానికి తగ్గించి ఆ మేరకు 40 శాతం మొత్తాన్ని విశ్రాంత ఉద్యోగులకు కమ్యుటేషన్ మొత్తాలను అందించారు. ఇదే సమయంలో రిజర్వు బ్యాంకు వడ్డీ రేట్లను 12 శాతం నుంచి 7 శాతానికి తగ్గించింది. మరో పక్క 1980లో మనిషి సగటు జీవిత కాలం 57 ఏళ్లు కాగా 2010లో 72 ఏళ్లకు పెరిగింది. ప్రభుత్వ నిబంధనల మేరకు విశ్రాంత ఉద్యోగి 15 ఏళ్ల చెల్లింపు మధ్యలో చనిపోతే రికవరీ పూర్తిగా రద్దవుతుంది. సగటు వయస్సు పెరగడం వల్ల ప్రభుత్వానికి విశ్రాంత ఉద్యోగి చెల్లింపులో 99 శాతం నష్టం జరిగే అవకాశం తగ్గిపోయింది. ఈ మూడు అంశాలను విశ్రాంత ఉద్యోగులు హైకోర్టు ముందుంచగలిగారు.ప్రభుత్వం కూడా సానుకూలంగా స్పందించి రికవరీని నిలిపివేయాలని ఆదేశాలను జారీ చేసింది. విద్యుత్ సంస్థ విశ్రాంత ఉద్యోగులు కూడా ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా తమ రికవరీలను ఆపాలని కోరుతున్నారు.



పట్టుబడిన నాగుపాము


తిరుమల, నవంబరు26(ఆంధ్రజ్యోతి): తిరుమలలోని టీటీడీ ఆఫీసర్స్ క్వార్టర్స్ వద్ద మంగళవారం ఓ నాగుపాము పట్టుబడింది. టీటైప్ క్వార్టర్స్‌లో టీటీడీలోని వివిధ విభాగాల అధికారులు నివసిస్తుంటారు. మంగళవారం ఉదయం సుమారు ఆరు అడుగుల నాగుపాము 23వ నెంబరు గల ఇంట్లోకి వెళ్లి.. కొద్ది సమయానికే వెలుపలకు వచ్చేసింది. ఆ సమయంలో ఇంట్లో ఉన్న మహిళలు భయంతో బయటకు వచ్చి టీటీడీ కాంట్రాక్ట్ ఉద్యోగి భాస్కర్‌నాయుడికి సమాచారమిచ్చారు. పట్టుబడిన నాగుపాము మరో పిల్లపామును మింగేసినట్టు భాస్కర్‌నాయుడు తెలిపారు. ఆ పామును దట్టమైన అడవిలో విడిచిపెట్టాడు.

తిరుమల పవిత్రత పెంపొందేలా పనిచేయండి

- భానుప్రకాష్‌రెడ్డికి వెంకయ్య నాయుడి సూచన

తిరుపతి(ఉపాధ్యాయనగర్), నవంబరు 26(ఆంధ్రజ్యోతి): తిరుమల ప్రతిష్ఠ మరింతగా పెంపొందేలా పనిచేయాలని టీటీడీ సభ్యుడు భానుప్రకాష్‌రెడ్డికి మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు సూచించారు. చెన్నై రాజ్‌భవన్‌లో మంగళవారం భానుప్రకాష్‌రెడ్డి ఆయన్ను కలిశారు. శ్రీవారి తీర్థ ప్రసాదాలను అందజేశారు. ఈ సందర్భంగా కల్తీ నెయ్యి తదితర అంశాలను వెంకయ్య నాయుడు ఆరా తీసినట్లు తెలిపారు. తిరుమల పవిత్రతను కాపాడుతూ మంచి నిర్ణయాలు తీసుకోవాలని సూచించారు.





హద్దు మీరినందుకేనా!

- చెవిరెడ్డిపై పోక్సో, ఎస్సీఎస్టీ కేసులు
- మైనర్ బాలిక విషయంలో అమానవీయ రాజకీయం ఫలితం
- బలమైన సెక్షన్లతో షాక్ ఇచ్చిన జిల్లా పోలీస్
- వైసీపీ కేడర్‌లో కలకలం

తిరుపతి, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): సోషల్ మీడియాలో హద్దులు మీరుతున్నవారిపై ప్రభుత్వం కఠినచర్యలకు పూనుకుంటున్నా లెక్కలేనట్టుగా వ్యవహరిస్తున్న జిల్లా వైసీపీ నేతలకు గట్టి హెచ్చరికే ఎదురైంది. చంద్రగిరి మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కరరెడ్డిపై ఏకంగా పోక్సో, ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ వంటి తీవ్రత కలిగిన సెక్షన్లతో కేసు నమోదు కావడం వారిని నివ్వెరపరుస్తోంది. అధికారంలోకి వచ్చిన ఐదు నెలలకే కూటమి ప్రభుత్వం ప్రతిష్ఠను దొంగ దెబ్బతీసేందుకు వైసీపీ సోషల్ మీడియాతో పాటూ జిల్లా నాయకులు కూడా రెచ్చిపోయారు. కల్తీ నెయ్యి కుంభకోణం, శ్రీవాణి నిధులపై అనుమానాలు, తిరుపతికి ఇష్టారాజ్యంగా వందల కోట్ల టీటీడీ సొమ్ములు మళ్లించడం వంటి అంశాలు భగ్గుమంటున్నా జిల్లాలోని కొందరు వైసీపీ నాయకుల దూకుడు తగ్గలేదు. మీడియా సమావేశాల్లోనూ హద్దులు దాటి వ్యాఖ్యలు చేస్తూనే ఉన్నారు. వీరిపట్ల ఉదాసీనంగా ఉన్నారంటూ కూటమి కేడర్ అసంతృప్తితో రగిలిపోతోంది. మరోవైపు పార్టీలకు అతీతంగా రాజకీయ నాయకులకు ఇదో హెచ్చరిక అవుతుందని జనం భావిస్తున్నారు.

లెక్కలేని తనమే కొంప ముంచుతోందా?

రాష్ట్ర ప్రభుత్వం కఠినంగా ఉన్నా జిల్లా వైసీపీ నాయకులు తేలిగ్గా తీసుకున్నందువల్లే వారి చాపకిందకు నీరొచ్చిందని అంటున్నారు. జగన్ అధికారంలో ఉన్నపుడు వ్యవహరించిన తీరుకు ఇప్పుడూ వీరు ఏమాత్రం తగ్గడం లేదంటున్నారు. సామాజిక బాధ్యత లేకుండా ఓ మైనర్ దళిత బాలికపై అనుచిత ప్రచారం సాగించడం, బాలిక ఉనికిని బయటపెట్టడం ప్రజలను షాక్‌కు గురి చేసింది. మైనర్ బాలికలకు సంబంధించి ఏదైనా నేరం జరిగినపుడు వారి వివరాలు బహిర్గతం చేయకూడదు. వారి పేర్లు గానీ, ఫోటోలు గానీ, వారి ఉనికిని తెలిపే ఏ ఒక్క విషయమూ వెల్లడించకూడదు. వైసీపీ నేతలు అన్నింటినీ ఉల్లంఘించారు. ఇది బాధ్యతా రాహిత్యం కాక మరేమిటవుతుందన్న ప్రశ్న ఎదురవుతోంది.

ఏ2 తర్వాత ఎవరు?

చెవిరెడ్డిపై పెట్టిన కేసు.. రెచ్చిపోతున్న మిగిలిన వైసీపీ నేతలకు గట్టి హెచ్చరికగా భావిస్తున్నారు. అనేక ఆరోపణలను ఇప్పటికే ఎదుర్కొంటున్న ఆ నాయకులకీ ఇబ్బందులు తప్పవనే చర్చ జరుగుతోంది. బాలిక వ్యవహారంలోనూ రుయా ఆసుపత్రి వద్దకు చేరుకుని హల్‌చల్ చేసిన నాయకుల పేర్లు కూడా తదుపరి జాబితాలో ఉంటాయని అంటున్నారు. ఇదే కేసులోనూ మరికొందరి పేర్లు చేరుస్తారని చెబుతున్నారు.

అమానవీయం కాదా?

ఎర్రావారిపాలెం మండలంలో ఈనెల 4న జరిగిన ఘటనలో అత్యాచారం జరిగిందని బాధిత బాలిక చెప్పలేదు. తల్లిదండ్రులు కూడా చెప్పలేదు. ఒంటిపై వున్న స్వల్ప గాయాలు చూపి తనపై దాడి జరిగిందని బాలిక చెప్పింది కూడా అబద్ధమేనని విచారణలో భాగంగా జిల్లా ఎస్పీ మరుసటి రోజే ప్రకటించారు. స్వల్ప గాయాలు సైతం బాలిక తనకు తానుగా చేసుకున్నవే తప్ప ఇతరులు చేసింది కాదని ఎస్పీ స్పష్టం చేశారు. అయితే వీటికి పూర్తి భిన్నంగా వైసీపీ నేతలు మీడియా ఎదుట ఆరోపణలు చేయడం విస్తుగొలుపుతోంది. బాలిక వివరాలు బయటపెట్టడం, చివరికి చినిగిన దుస్తులతో చికిత్స పొందుతున్న బాలిక ఫోటోను కూడా సామాజిక మాధ్యమాల్లో పోస్టు చేయడం అంతకంటే దారుణమన్న విమర్శలు వస్తున్నాయి.

చెవిరెడ్డికి ఏమైంది?

సాధారణంగా చెవిరెడ్డి ఎవరిపైనా ఘాటు ఆరోపణలు చేసేవారు కాదు. మీడియా సమావేశాల్లోనూ ఆచితూచి మాట్లాడేవారు. అధికారంలో ఉన్న అయిదేళ్లూ సంయమనంగా ఉన్న ఆయన ఇప్పుడు వ్యవహరిస్తున్న తీరు విమర్శలకు గురవుతోంది. ఎర్రావారిపాలెం మండల ఘటనకు సంబంధించి ఈనెల 4, 5 తేదీల్లో వ్యవహరించిన తీరు భిన్నంగా వుందన్న వ్యాఖ్యలు జనం నుంచీ వినిపిస్తున్నాయి. తాను ఎంతో క్రమశిక్షణ కలిగిన వ్యక్తిగా తరచూ చెప్పుకునే చెవిరెడ్డే పోలీసులు తనపై బలమైన సెక్షన్లతో కేసు పెట్టే అవకాశం ఇవ్వడమే ఇపుడు చర్చనీయాంశమవుతోంది.

డీలాపడుతున్న వైసీపీ శ్రేణులు

రాష్ట్ర వైసీపీలో బలమైన నేత, జగన్‌కి అత్యంత సన్నిహితుడు అయిన చంద్రగిరి మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కరరెడ్డిపైనే కేసు పెట్టడంతో జిల్లావ్యాప్తంగా వైసీపీ వర్గీయుల ఆందోళనకు గురవుతున్నారు. కేడర్ అయితే డీలా పడిపోతోంది. పెద్ద నాయకుల పరిస్థితే ఇలా ఉంటే తమ గతేమవుతుందనే ఆందోళన, భయం వారిలో పెరిగిందంటున్నారు.

తిరుపతిలో 'సిట్' కార్యాలయం సిద్ధం

తిరుపతి(నేరవిభాగం), నవంబరు 26(ఆంధ్రజ్యోతి): తిరుపతిలో సీబీఐ సిట్ కార్యాలయం సిద్ధమైంది. టీటీడీ పరిధిలోని భూదేవి కాంప్లెక్సులో ఉన్న ఎస్వీబీసీ పాత కార్యాలయంలో ఏర్పాటు చేశారు. ఇందులోకి ఎవరినీ అనుమతించడంలేదు. గుర్తింపు కార్డులున్న టీటీడీ సిబ్బందినే అనుమతిస్తున్నారు. సిట్ కార్యాలయంలో సోమవారం ప్రాథమికంగాను.. మంగళవారం నుంచి పూర్తిస్థాయిలో అధికారిక కార్యకలాపాలను చేపట్టారు. గ్రౌండు ఫ్లోర్‌లో వీడియో కాన్ఫరెన్సు హాలు, మొదటి అంతస్తులో విచారణ, కార్యాలయం ఏర్పాటు చేశారు. ఇప్పటికే స్వాధీనం చేసుకున్న ఏఆర్, వైష్ణవి డెయిరీలకు సంబంధించి ఫైళ్లు, టీటీడీకి, డెయిరీల మధ్య కుదిరిన ఒప్పందాల రికార్డులను ఇక్కడ పరిశీలిస్తున్నారు. ప్రతి రోజూ ఇక్కడ జరుగుతున్న పరిణామాలు, విచారణ నివేదికలను వీడియో కాన్ఫరెన్సు ద్వారా సీబీఐ అధికారులకు వివరిస్తున్నారు. సిట్ కార్యాలయం వద్ద భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. రిజర్వు బలగాలు మోహరించాయి. అదనపు ఎస్పీ స్థాయి అధికారి నేతృత్వంలో విచారణ ప్రారంభించారు. ప్రస్తుతం నలుగురు డీఎస్పీలు, ఇద్దరు సీఐలు, మరికొందరు పోలీసు బృందాలు కలసి టీమ్‌లుగా విడిపోయి విచారిస్తున్నారు. ఇప్పటి వరకు రెండు డెయిరీలకు సంబంధించిన దాదాపు 25 నుంచి 40 ఫైళ్లు స్వాధీనం చేసుకుని సిట్ కార్యాలయం వద్ద పరిశీలిస్తున్నట్లు తెలిసింది.

పంటబీమాను సద్వినియోగం చేసుకోండి

చిత్తూరు సెంట్రల్, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): రబీ సీజనులో ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన, వాతావరణ ఆధారిత బీమా పథకాలకు సంబంధించి రైతులు ప్రీమియం చెల్లించాలని వ్యవసాయ శాఖ జేడీ మురళీకృష్ణ మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. తుపాను, కరువు, అకాల వర్షాలు, ప్రకృతి వైపరీత్యాల వల్ల పంట నష్టపోయిన రైతులకు ఆర్థిక సాయం అందించడమే ఈ పథకాల ఉద్దేశమన్నారు. వరి, వేరుశనగ పంటల రైతులు నిర్ణీత సమయంలో ప్రీమియం చెల్లించాలన్నారు. కౌలు రైతులు కూడా బీమాకు అర్హులన్నారు. డిసెంబరు నెలాఖరులోపు వరికి ప్రీమియం కింద రూ.84 చెల్లించాలన్నారు. వేరుశనగకు డిసెంబరు 15లోపు ప్రీమియం రూ.60 చెల్లించాలన్నారు. ప్రతి రైతు బీమా సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

రాజ్యాంగ నిర్మాతకు అధికారుల నివాళులు



అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న జేసీ, డీఆర్వో, అధికారులు

చిత్తూరు కలెక్టరేట్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా మంగళవారం కలెక్టరేట్‌లోని పాత గ్రీవెన్స్‌హాలులో అంబేడ్కర్ చిత్రపటానికి జేసీ విద్యాధరి నివాళులర్పించారు. జిల్లాస్థాయి అధికారులు, కలెక్టరేట్ సిబ్బందితో జేసీ ప్రతిజ్ఞ చేయించారు. జేసీ మాట్లాడుతూ రాజ్యాంగానికి విశేష లక్షణాలున్నాయన్నారు. మనది ప్రపంచంలోకెల్లా అతిపెద్ద రాజ్యాంగమన్నారు. అంబేడ్కర్ పలు అంశాలను, పలు దేశాల రాజ్యాంగ విధానాలను అధ్యయనం చేసి భారత రాజ్యాంగాన్ని తయారుచేశారన్నారు. డీఆర్వో కె. మోహన్ కుమార్ తదితరులు మాట్లాడారు. కార్యక్రమంలో కలెక్టరేట్ ఏవో కులశేఖర్, సాంఘిక, మైనార్టీ, గిరిజన సంక్షేమశాఖల అధికారులు రాజ్యలక్ష్మి, చిన్నారెడ్డి, మూర్తి, హౌసింగ్ పీడీ పద్మనాభం, డీఎల్డీవో రవికుమార్, వివిధ శాఖల జిల్లా అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

మాతృప్రేమను చాటే దేవకీ నందన వాసుదేవ

- గల్లా అరుణకుమారి



చిత్తూరు రూరల్, నవంబరు 26(ఆంధ్రజ్యోతి):దేవకీ నందన వాసుదేవ చిత్రంలో తన మనవడు గల్లా అశోక్ చాలా బాగా నటించాడని మాజీ మంత్రి గల్లా అరుణకుమారి అభినందించారు. మంగళవారం చిత్తూరు రాఘవ థియేటర్‌లో టీడీపీ నాయకులతో కలసి సినిమాను ఆమె వీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మారుతున్న కాలానికి అనుగుణంగా సనాతన ధర్మం, మాతృప్రేమను తెలియజేసే సినిమా అన్నారు. మాజీ ఎమ్మెల్సీ దొరబాబు,చుడా చైర్‌పర్సన్ కటారి హేమలత, మాజీ ఎంపీ దుర్గా రామకృష్ణ, మాజీ ఎమ్మెల్యే వెంకటేశ్వర చౌదరి, మోహన్ రాజ్ తదితరులు పాల్గొన్నారు.

ఇద్దరు లాటరీ టికెట్ల విక్రేతల అరెస్ట్

పుంగనూరు రూరల్, నవంబరు26(ఆంధ్రజ్యోతి): పుంగనూరులో లాటరీ టికెట్లు విక్రయిస్తున్న ఇద్దరిని పోలీసులు మంగళవారం అరెస్ట్ చేశారు. వారి నుంచి రూ.12.80 లక్షల విలువైన లాటరీ టికెట్లు స్వాధీనం చేసుకున్నారు. సీఐ శ్రీనివాసులు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో మీడియాతో మాట్లాడుతూ పట్టణంలో సుబేదార్‌వీధికి చెందిన నజీర్‌బాషా(43), హైస్కూల్ వీధికి చెందిన మహ్మద్‌హసేన్(29) సుబేదార్‌వీధిలో లాటరీ టిక్కెట్లు విక్రయిస్తున్నట్లు సమాచారం అందడంతో దాడులు చేశామన్నారు. వారి వద్ద రూ. 12.80లక్షల విలువ చేసే లాటరీ టిక్కెట్లు పట్టుబడ్డాయని తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

విద్యతోనే స్థితిగతుల మార్పు

- విద్యాశాఖ డైరెక్టర్ విజయరామరాజు



సమావేశంలో మాట్లాడుతున్న విద్యా శాఖ డైరెక్టర్ విజయ రామ రాజు

గుడుపల్లె, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): విద్యతోనే ఆర్థిక, సామాజిక స్థితిగతుల మార్పు సాధ్యమని రాష్ట్ర విద్యాశాఖ డైరెక్టర్ విజయరామరాజు పేర్కొన్నారు.ఎంఈవోలు, ప్రధానోపాధ్యాయుల్లో నాయకత్వ లక్షణాలను పెంపొందించే లక్ష్యంతో గుడుపల్లె మండలంలోని అగస్త్య ఫౌండేషన్ ఆడిటోరియంలో వారం రోజులుగా విద్యాశాఖ ఆధ్వర్యంలో జరిగిన శిక్షణా కార్యక్రమం మంగళవారంతో ముగిసింది.ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న విజయరామరాజు మాట్లాడుతూ..పాఠశాల విద్యార్థులకు ఉపాధ్యాయులు ఉత్తమ విలువలతో కూడిన బోధన అందించాలన్నారు. విద్యార్థి దశ నుంచే నైతిక విలువలతో కూడిన విద్యను అందించేందుకు రాష్ట్రప్రభుత్వం చర్యలు చేపడుతోందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా డిసెంబరు 7న అన్ని పాఠశాలల్లో పేరెంట్స్, టీచర్స్ సమావేశాలు నిర్వహించాలన్నారు. పాఠశాలల అభివృద్ధిలో ప్రజల భాగస్వామ్యాన్ని పెంచడమే ముఖ్యమన్నారు. విద్యార్థుల్లో అభ్యసన సామర్థ్యాలను మెరుగుపరిచేందుకు ఉపాధ్యాయులు అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికితీసేలా బోధనా విధానాలు ఉండాలన్నారు.విద్యార్థులు పొరబాట్లు చేస్తే నిరుత్సాహపరచడం, కఠినంగా శిక్షించడం చేయకుండా అర్థమయ్యేలా చెప్పి సరిదిద్దాలన్నారు. కలెక్టరు సుమిత్‌కుమార్, ఆర్జేడీ శామ్యూల్, డీఈవో వరలక్ష్మి, సమగ్ర శిక్షణ ఏపీసీ వెంకట్రమణారెడ్డి, ఆర్డీవో శ్రీనివాసరాజు, డీవైఈవో చంద్రశేఖర్, జీసీఈవో ఇంద్రాణి, అగస్త్య ఫౌండేషన్ ప్రతినిధులు సురేష్, పుష్ప తదితరులు పాల్గొన్నారు.

కలెక్టరేట్ వద్ద వామపక్షాల బైఠాయింపు

- రాజ్యాంగాన్ని కాపాడుతామని రైతు సంఘాల నేతల పిలుపు



ధర్నాలో మాట్లాడుతున్న ఏఐటీయూసీ జిల్లా గౌరవాధ్యక్షుడు నాగరాజన్

చిత్తూరు అర్బన్, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): కేంద్రంలో బీజేపీ సంకీర్ణ ప్రభుత్వంపూ కార్మిక, రైతు సంఘాల నేతలు నిప్పులు చెరిగారు. దేశవ్యాప్త పిలుపులో భాగంగా మంగళవారం కలెక్టరేట్ వద్ద ఏఐటీయూసీ, సీఐటీయూసీ, ఐఎఫ్‌టీయూ, రైతు సంఘాలు, కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ధర్నా చేశారు. ఈ సందర్భంగా వివిధ సంఘాల నేతలు నాగరాజన్, గంగరాజు, సురేంద్రనాథ్‌లు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్పొరేట్ అధిపతులకు ఊడిగం చేస్తూ కార్మిక, రైతులను మోసం చేస్తున్నాయని విమర్శించారు. మతోన్మాద బీజేపీ ప్రభుత్వం రాజ్యాంగాన్ని రద్దుచేస్తామని పార్లమెంటు సాక్షిగా చెబుతోందన్నారు. మను ధర్మ శాస్త్రాన్ని ప్రవేశపెడతామని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. ఉపాధి పథకానికి కేంద్ర ప్రభుత్వం తూట్లు పొడిచి లబ్ధిదారుల సంఖ్యను తగ్గిస్తోందన్నారు. ఇప్పటికైనాకేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణను నిలుపుదల చేయాలని డిమాండ్ చేశారు. రాజ్యాంగ స్ఫూర్తితో దేశాన్ని కాపాడుకోవడానికి అన్నివర్గాల వారు మరోపోరాటానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. అనంతరం జేసీ విద్యాధరికి వినతిపత్రాన్ని ఇచ్చారు. నేతలు మునిరత్నం నాయుడు, మణి, రమాదేవి, దామోదరం, మహేష్, రఘు,విజయ తదితరులు పాల్గొన్నారు.

108 సిబ్బంది సమ్మె చేసినా

ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయండి

- వీడియో కాన్ఫరెన్‌లో పీఎస్ కృష్ణబాబు

చిత్తూరు రూరల్, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): 108 సిబ్బంది ఈనెల 26వ తేదీ సాయంత్రం నుంచి సమ్మెకు వెళ్లనున్నట్లు కలెక్టర్‌కు సహా జిల్లా అధికారులందరికి సమ్మె నోటీసు సమర్పించారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వంతో చర్చలు నిర్వహిస్తున్నారు. చర్చలు విఫలమై వారు సమ్మెకు వెళ్లినా 108 సేవలు ఆగకుండా చర్యలు తీసుకోవాలని వైద్య ఆరోగ్య శాఖ ముఖ్యకార్యదర్శి క్రిష్ణబాబు డీఎంహెచ్‌వో ప్రభావతి దేవికి దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 108 వాహనాల డ్రైవర్లుగా ఆర్టీసీ హయర్ బస్సుల డ్రైవర్లను సిద్ధం చేసుకోవాలన్నారు. ఇందు కోసం ఆర్టీసీ అధికారులతో మాట్లాడాలన్నారు. 108లో వైద్య సేవలకు సామాజిక ఆరోగ్య కార్యకర్తలను షిఫ్టులుగా విభజించి సిద్ధం చేసుకోవాలన్నారు. అత్యవసర సర్వీసులు ఆగకూడదని క్రిష్ణబాబు స్పష్టం చేశారు.

తిరుపతి జిల్లాకు ఫిలిప్స్ కార్బన్ బ్లాక్ పరిశ్రమ

- నాయుడుపేట వద్ద రూ. 3718 కోట్లతో ప్లాంట్ ఏర్పాటుకు ఆసక్తి
- 116 ఎకరాల కేటాయింపునకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్

తిరుపతి, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): తిరుపతి జిల్లా పారిశ్రామిక అభివృద్ధికి సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్‌తీసుకుంటున్న చర్యలు ఫలితాలనిస్తున్నాయి. తాజాగా నాయుడుపేట వద్ద రూ.3718 కోట్ల భారీ పెట్టుబడితో ప్లాంట్ ఏర్పాటు చేసేందుకు ఫిలిప్స్ కార్బన్ బ్లాక్ లిమిటెడ్ సంస్థ ముందుకొచ్చింది. దీనికి నాయుడుపేట వద్ద 116 ఎకరాలు కేటాయించేందుకు రాష్ట్ర ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. పారిశ్రామిక రంగ అభివృద్ధికి కూటమి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు ఎంత వేగవంతంగా అమలవుతున్నాయో తెలుసుకునేందుకు ఈ పరిశ్రమే ఓ ఉదాహరణ. రబ్బర్ బ్లాక్స్, వాల్యూ యాడెడ్ కెమికల్స్ తయారీకి పేరుపడిన ఈ పరిశ్రమ.. నాయుడుపేట వద్ద ప్లాంట్ ఏర్పాటుపై తమ ఆసక్తి చూపింది. ఈ మేరకు 116.62 ఎకరాలను చదరపు మీటరుకు రూ.1948 ధరతో కేటాయించాలని సెప్టెంబరు 20న ఏపీఐఐసీకి దరఖాస్తు చేసుకుంది. రూ.3718 కోట్ల పెట్టుబడితో ప్లాంట్ ఏర్పాటు చేస్తామని, తద్వారా 200 మందికి ఉద్యోగావకాశాలు కల్పిస్తామని తెలియజేసింది. కేవలం రెండు నెలల వ్యవధిలోనే ఆ ఫైలు ఆయా విభాగాల నడుమ పరుగులు తీసింది. ఈ నెల 16వ తేదీన రాష్ట్ర పెట్టుబడుల ప్రోత్సాహక కమిటీ సమావేశమై అదే ధరతో భూమిని కేటాయించాలని సిఫారసు చేసింది. 19వ తేదీన బోర్డు ఆమోదించింది. ఈ సిఫారసులకు అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వం నాయుడుపేట సెజ్‌ను డీనోటిఫై చేసి 116.62 ఎకరాల భూమిని ఫిలిప్స్ పరిశ్రమకు కేటాయించాలని ఏపీఐఐసీని ఆదేశిస్తూ మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. అన్ని సదుపాయాలనూ త్వరగా కల్పించి త్వరగా పరిశ్రమల ఏర్పాటయ్యేలా చూడాలని వివిధ శాఖలకు ఆదేశాలు జారీ చేసింది.

శబరిమలై యాత్రలో విషాదం

- రాజులకండ్రిగ భక్తుడి ఆకస్మిక మృతి



తిరుమలేష్(ఫైల్‌ఫొటో)

వెదురుకుప్పం, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): శబరిమలైకి వెళ్లిన భక్తుడు తిరుగు ప్రయాణంలో మృతి చెందిన వైనమిది. కార్వేటినగరం మండలం టీకేఎంపేట గ్రామ పంచాయతీ రాజులకండ్రిగకు చెందిన 22 మంది అయ్యప్ప భక్తులు గురువారం రాత్రి కార్వేటినగరం ద్రౌపది సమేత ధర్మరాజుల ఆలయం వద్ద ఇరుముడి కట్టుకున్నారు. అక్కడి నుంచి మినీ బస్సులో శబరిమలైకి బయలుదేరారు. స్వామిని దర్శించుకున్నారు. వారంతా తిరుగు ప్రయాణమయ్యారు. సోమవారం పళణి దాటి 25 కి.మీ దూరం వచ్చాక బస్‌లో తిరుమలేష్ ఆకస్మికంగా కుప్పకూలారు. ఆస్పత్రికి తరలించగా తుదిశ్వాస విడిచాడు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. పళని మృతితో రాజులకండ్రిగలో విషాదం నెలకొంది. మంగళవారం అంత్యక్రియలు నిర్వహించారు.

అంతర్రాష్ట్ర రహదారికి మోక్షమెన్నడో..?



కడపనత్తం వరకు వేసివున్న తారురోడ్డు



అసంపూర్తిగా వున్న పేర్నంబట్‌కు వెళ్లే రహదారి

బైరెడ్డిపల్లె మండలంలో కడపనత్తం మీదుగా తమిళనాడులోని పేర్నంబట్టుకు వెళ్లే అంతర్రాష్ట్ర రహదారికి కొత్త ప్రభుత్వ హయాంలోనైనా మోక్షం కలగాలని మండలప్రజలు కోరుకుంటున్నారు. బైరెడ్డిపల్లె నుంచి కడపనత్తం మీదుగా పేర్నంబట్టుకు వెళ్లాలంటే 25 కిలోమీటర్ల దూరం వుంది. ఈ రహదారి నిర్మాణపనులు పూర్తయితే వ్యాపారరీత్యా ఈ ప్రాంతం అభివృద్ధి చెందే అవకాశం వుంది. బైరెడ్డిపల్లె నుంచి పేర్నంబట్టు మీదుగా చెన్నైకి రైతులు పంటల ఉత్పత్తులను తరలించడానికి ఈ రహదారివల్ల ఎంతో సౌకర్యం కలుగుతుంది. 1999 - 2000 మధ్య కాలంలో అప్పటి టీడీపీ ప్రభుత్వం రెండు విడతలుగా రూ. 35లక్షలతో పేర్నంబట్టుకు వెళ్లే రహదారిలో ఆంధ్ర సరిహద్దు వరకు రోడ్డు అభివృద్ధిపనులు చేసింది. ఇందులో కొంతదూరం వరకు తారురోడ్డు కూడా వేశారు. తమిళనాడు సరిహద్దు నుంచి పేర్నంబట్టు వరకు ప్రస్తుతం రహదారి అధ్వానస్థితిలో వుంది. తమిళనాడు, ఆంధ్ర రాష్ట్రాల ప్రభుత్వాలు సమన్వయంతో రోడ్డునిర్మాణపనులు చేపడితే సమస్య పరిష్కారమవుతుంది. ప్రస్తుతం పేర్నంబట్టుకు వెళ్లాలంటే బైరెడ్డిపల్లె నుంచి వి.కోట మీదుగా 50 కి.మీ దూరం ప్రయాణించాలి. కడపనత్తం మీదుగా రహదారి ఏర్పాటైతే కేవలం 25కి.మీ దూరంతో పేర్నంబట్టుకు వెళ్లొచ్చు. ఆంధ్రసరిహద్దులో అటవీశాఖ వారు ఈ మార్గంలో వాహనాలు వెళ్లకుండా కలప, బియ్యం అక్రమరవాణాను నిరోధించడానికి, గజదాడుల నివారణకు ఇనుపగేటు ఏర్పాటుచేశారు. ప్రజాప్రతినిధులు, అధికారులు చొరవ తీసుకుని రహదారిపనులు పూర్తయ్యేలా కృషిచేయాలని ప్రజలు కోరుతున్నారు.

- బైరెడ్డిపల్లె, ఆంధ్రజ్యోతి

రహదారి కోసం ఎదురుచూస్తున్నాం



పేర్నంబట్టు రహదారి ఏర్పాటు కోసం ఎన్నోయేళ్లుగా ఎదురుచూస్తున్నాం. అంతర్రాష్ట్ర రహదారి ఏర్పాటైతే వాణిజ్యపరంగా ఈప్రాంతం అభివృద్ధి చెందుతుంది. దీనిపై ప్రభుత్వం ప్రత్యేకశ్రద్ధ తీసుకోవాలి.

- దామోదరనాయుడు, కడపనత్తం

రైతులకు ఎంతో సౌకర్యం



పేర్నంబట్టు రహదారి ఏర్పాటైతే రైతులు పండించిన పంటలు మార్కెట్‌కు తరలించడానికి ఎంతో సౌకర్యం కలుగుతుంది. అలాగే బస్సు సౌకర్యం కలిగి తమిళనాడుకు రాకపోకలు సాగించడానికి వీలుగా వుంటుంది.

- చెంగల్రాయప్ప, కడపనత్తం

కుప్పం అభివృద్ధే చంద్రబాబు ధ్యేయం


ఆనందరెడ్డికి కేక్ తినిపిస్తున్న కంచర్ల

రామకుప్పం, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): మూడు దశాబ్దాలకు పైగా ఆదరిస్తున్న ప్రజల రుణం తీర్చుకునేలా ఐదేళ్లల్లో కుప్పం నియోజకవర్గంలో అనూహ్యమైన అభివృద్ధి పనులు చేపట్టాలన్నదే సీఎం చంద్రబాబు ధ్యేయమని ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ తెలిపారు. రామకుప్పంలో మంగళవారం టీడీపీ మండల అధ్యక్షుడు ఆనందరెడ్డి జన్మదిన వేడుకలను పార్టీ శ్రేణులు ఘనంగా నిర్వహించాయి. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడుతూ ఎయిర్‌పోర్టు, భారీ పరిశ్రమలను రామకుప్పం మండలంలో ఏర్పాటు చేస్తున్నట్టు ఆయన గుర్తుచేశారు. రామకుప్పంలో ప్రధాన రహదారి విస్తరణ, మిట్టపల్లె పెద్దచెరువు సుందరీకరణ, వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేస్తామన్నారు. అదేవిధంగా వళ్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి ఆలయాన్ని పునర్మిస్తామన్నారు. టీడీపీ నాయకులు మునస్వామి, పత్ర నారాయణాచారి, నరసింహులు, ఆంజినేయరెడ్డి, చిన్నికృష్ణ, చలపతి, సీతాపతి, రామ్మూర్తి, జయశంకర్, సలాంసాబ్, మనోహర్ పాల్గొన్నారు.

ప్రజాప్రతినిధులను విస్మరించడం తగదు

బైరెడ్డిపల్లె, నవంబరు 26 ఆంధ్రజ్యోతి) : ప్రజా ప్రతినిధులను విస్మరించడం తగదని సభ్యులు అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. బైరెడ్డిపల్లె మండల సమావేశం మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ రెడ్డెప్ప అధ్యక్షతన జరిగింది. ఇటీవల నిర్వహించిన రెవిన్యూ సదస్సుల గురించి ప్రజా ప్రతినిధులకు సరైన సమాచారం అందించలేదని సభ్యులు ఆరోపించారు. అనంతరం అభివృద్ధి పనుల గురించి సమీక్షించారు. జడ్పీటీసీ కేశవులు, ఎంపీడీవో రాజేంద్రబాలాజీ పాల్గొన్నారు.

ఉపాధి అవకతవకలపై డ్వామా పీడీకి ఫిర్యాదు

బైరెడ్డిపల్లె, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఉపాధి పనుల్లో జరుగుతున్న అవకతవకలపై విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ఎంపీపీ రెడ్డెప్ప, జడ్పీటీసీ కేశవులు, సర్పంచులు, ఎంపీటీసీలతో కలసి డ్వామా పీడీ రవికుమార్‌కు ఫిర్యాదు చేశారు. మంగళవారం బైరెడ్డిపల్లె ఎంపీడీవో కార్యాలయానికి వచ్చిన డ్వామా పీడీతో ఎంపీపీ మాట్లాడారు.

టీబీ నిర్మూలనకు కృషిచేయాలి

గంగవరం, నవంబరు 26,(ఆంధ్రజ్యోతి): టీబీని సమూలంగా నిర్మించడం కోసం ప్రతిఒక్కరూ బాధ్యతగా పనిచేయాలని జిల్లా టీబీ నివారణాధికారి డాక్టర్ వెంకటప్రసాద్ పేర్కొన్నారు. మంగళ వారం స్థానిక లయన్స్ క్లబ్‌లో వైద్యసిబ్బందితో టీబీ నిర్మూలనకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీబీని ప్రాథమిక దశలోనే నిర్మూలించవచ్చన్నారు. స్కూల్ హెల్త్ కో-ఆర్డినేటర్ డాక్టర్ శిరీష, జయ రామయ్య, డాక్టర్లు లహరి, నిరంజన్, ఆశ, సబ్ యూనిట్ అధికారి జయశంకర్ పాల్గొన్నారు.

భూసార పరీక్షలతో అధిక దిగుబడి

గంగవరం, నవంబరు 26, (ఆంధ్రజ్యోతి): భూసార పరీక్షలు చేయించుకొని, దానికి తగ్గట్లు పంటలు పండించినప్పుడే అధిక దిగుబడిని సాధించడానికి అవకాశముందని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి మురళీకృష్ణ పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని కీలపట్ల, బొమ్మనపల్లె గ్రామాల్లో 'పొలం పిలుస్తోంది' కార్యక్రమంలో భాగంగా రైతులకు పంటల సాగు, సంరక్షణ, ఎరువుల వినియోగంపై అవగాహన కల్పించారు. రైతు సేవా కేంద్రాల్లో రైతులకు ఎరువులు, విత్తనాలు అందుబాటులో ఉన్నాయని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ చంద్రశేఖర్, పుంగనూరు ఏడీఏ శివకుమార్, ఏవో హేమలత, పశువైద్యాధికారి ప్రియాంక, విమల, మాధవి, హారిక పాల్గొన్నారు.

ఆర్‌ఎంపీపై ఫిర్యాదు

గంగవరం, నవంబరు26,(ఆంధ్రజ్యోతి): ఆర్‌ఎంపీ గదిని అధికారులు సీజ్ చేసినా మళ్లీ యథావిధిగా నకిలీ వైద్యం కొనసాగిస్తున్నాడని అమరనాథ్ అనే వ్యక్తి మంగళవారం జిల్లా టీబీ నివారణ అధికారి వెంకటప్రసాద్‌కు ఫిర్యాదు చేశారు. ఐదు నెలల క్రితం తన తండ్రి గోవిందప్ప కు జ్వరం రావడంతో ఆర్‌ఎంపీ గోపాల్‌రెడ్డిని ఆశ్రయించారన్నారు. ఇంజక్షన్ వేసిన కొద్దిసేపటికే తన తండ్రి మృతిచెందాడన్నారు. ఈ విషయంపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడంతో విచారణ చేసిన అధికారులు ఆర్‌ఎంపీ క్లినిక్‌ను సీజ్ చేశారన్నారు. అయితే సీజ్ చేసిన కినిక్‌ను మళ్లీ తెరచి వైద్యం చేస్తున్నాడని తెలియజేశారు. అతడిపై చర్యలు తీసుకుని ప్రజల ప్రాణాలకు రక్షణ కల్పించాలని కోరారు.

రెండు సబ్ స్టేషన్లు మంజూరు

వి.కోట, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): వి.కోట మండల పరిధిలో లోవోల్టేజ్ సమస్య పరిష్కారానికి రెండు సబ్ స్టేషన్లు మంజూరు చేసినట్లు ఏఎంసీ మాజీ చైర్మన్ రామచంద్రనాయుడు, మండల పార్టీ అధ్య క్షులు రంగనాథ్ వెల్లడించారు. బోయచిన్నాగనపల్లె పంచాయతీ లింగాపురంలో, కొంగాటం పంచాయతీ పరిధిలో అన్నవరం క్రాస్‌లో ఈ సబ్ స్టేషన్లను ఏర్పాటుచేయనున్నట్లు వివరించారు.

పోలీసులను ఆశ్రయించిన ప్రేమజంట

రొంపిచెర్ల, నవంబరు26:(ఆంధ్రజ్యోతి): పెద్దల నుంచి రక్షణ కల్పించాలని ఓ ప్రేమజంట పోలీసులను ఆశ్రయించింది. రొంపిచెర్లకు చెందిన రెడ్డెప్ప, భాకరాపేటకు చెందిన చిట్టి ప్రసన్న కొంతకాలంగా ప్రేమించుకున్నారు. అమ్మాయికి వారి తల్లిదండ్రులు పెళ్లి సంబంధాలు చూస్తుండటంతో ప్రేమికులు మంగళవారం రొంపిచెర్లలోని ఓ ఆలయంలో పెళ్లిచేసుకున్నారు. ఈ విషయం తెలుసుకున్న చిట్టిప్రసన్న తల్లి అక్కడికి చేరుకుని వారితో ఘర్షణకు దిగింది. దీంతో వారు పోలీసులను ఆశ్రయించారు. ఇద్దరూ మేజర్లు కావడంతో పెద్దలు శాంతించాల్సి వచ్చింది.

గరుడవాహనంపై శ్రీవారి విహారం

సోమల, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): నెల్లిమంద పంచాయతీ బురుజుపల్లెలో కొలువుదీరిన శ్రీదేవి భూదేవి సమేత శ్రీవారి ఆలయ వార్షిక ఉత్సవాలలో భాగంగా స్వామి, అమ్మవార్లను పుష్పపల్లకీలో ఊరేగించారు. తొలుత ఆలయంలోని మూలవిరాట్‌కు విశేష అలంకరణ చేసి ప్రత్యేక అభిషేకపూజలు చేశారు. శ్రీదేవిభూదేవి సమేత శ్రీవారిని పల్లకీలో అలంకరించి ఊరేగించారు. దేవరెద్దుకు పూజలు జరిపారు. టీటీడీ అన్నమాచార్య ప్రాజెక్టు కళాకారులు అన్నమయ్య సంకీర్తలు ఆలపించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచు హరిప్రసాద్, రమేశ్ నాయుడు, సుధాకర్‌నాయుడు, కరణం వాసు, శ్రీనివాసులునాయుడు, నిరంజన్, రవీంద్ర, గుర్రప్పనాయుడు, సతీశ్ పాల్గొన్నారు.

మల్లేశ్వరస్వామి ఆలయ అభివృద్ధికి కృషి


చల్లాబాబుతో చర్చిస్తున్న టీడీపీ నాయకులు

కల్లూరు, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): కావేటిగారిపల్లి పంచాయతీలోని మల్లేశ్వర స్వామి ఆలయ అభివృద్ధికి కృషిచేస్తామని పుంగనూరు నియోజకవర్గం టీడీపీ ఇన్‌చార్జ్ చల్లా రామ చంద్రారెడ్డి తెలిపారు. పులిచెర్ల మండలం కావేటిగారిపల్లి పంచాయతీకి చెందిన టీడీపీ నాయకులు మంగళవారం చల్లా రామచంద్రారెడ్డిని కలిసి ఆలయ అభివృద్ధి నూతన కమిటీపై చర్చించారు. ఆలయానికి సంబంధించిన భూములు అన్యాక్రాంతం కాకుండా చూడాలని వినతిపత్రం అంద జేశారు. టీడీపీ నాయకులు ధనంజయనాయుడు, లోకేష్, అరుణాచలం నాయుడు, చెంగ్రాయ నాయుడు, పురుషోత్తం నాయుడు, గురు మూర్తి, రాజేష్ నాయుడు, ప్రసాద్, అంజనేయులు నాయుడు, ఆదికేశవులు, మాణిక్యం పాల్గొన్నారు.

రాజ్యాంగంపై అవగాహన ఉండాలి

సోమల, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): రాజ్యాంగంపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని సోమల జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ గంగాధరం నాయుడు పేర్కొన్నారు. మంగళవారం జూనియర్ కళాశాల, ఎంపీడీవో, తహసీల్దార్ కార్యాలయాల్లో రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎంపీడీవో నారాయణ, తహసీల్దార్ బెన్నురాజ్, ఈవోపీఆర్డీ లక్ష్మీదేవి, ఎన్‌ఎస్‌ఎస్ అధికారి గౌతం, అధ్యాపకులు శివయ్య, వెంకటసుబ్బయ్య, రామకృష్ణ పాల్గొన్నారు.

మన రాజ్యాంగం ఎంతో గొప్పది


ప్రతిజ్ఞ చేస్తున్న వీసీ, రిజిస్ట్రార్, అధ్యాపకులు

గుడుపల్లె, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): మన రాజ్యాంగం ప్రపంచలోనే ఎంతో గొప్పదని ద్రావిడ విశ్వవిద్యాలయ ఇన్‌చార్జి వీసీ ఆచార్య దొరస్వామి పేర్కొన్నారు. ద్రావిడ వర్సిటీలో మంగళవారం రాజ్యాంగం దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య కిరణ్ కుమార్, అకడమిక్ డీన్ ఆచార్య శ్యామల అధ్యాపకులు, పరిశోధకులు, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

చెక్కునత్తంలో నూతన బోరు

కుప్పం రూరల్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చెక్కునత్తం గ్రామంలో నూతనంగా వేసిన బోరులో మంగళవారం తాగునీళ్లు పుష్కలంగా పడ్డాయి. బోరు వేసి ప్రజల దాహార్తి తీర్చినందుకు తెలుగు యువత నాయకుడు చెక్కునత్తం మణి, ముఖ్యమంత్రి చంద్రబాబుకు ధన్యవాదాలు తెలిపారు.

చట్టాలపై అవగాహన అవసరం

పలమనేరు, నవంబరు26 (ఆంధ్రజ్యోతి): చట్టాలపై ప్రతి ఒక్కరికీ అవగాహన అవసరమని స్పెషల్ జడ్జి రాధమ్మ తెలియజేశారు. పలమనేరు కోర్టులో మంగళవారం న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. లా డే, డౌరీ డే సందర్భంగా నిర్వహించిన న్యాయవిజ్ఞాన సదస్సులో ఆమె ప్రసంగించారు. డిసెంబరు 14వ తేదీ లోక్ అదాలత్‌లో అత్యధిక కేసులు పరిష్కారం అయ్యేందుకు అందరూ సహకరించాలని కోరారు.

అంబేడ్కర్‌కు ఘన నివాళులు



రామకుప్పం, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): రాజ్యాంగ దినోత్సవాన్ని మండలంలోని పలు ప్రభుత్వ కార్యాలయాల్లో ఘనంగా నిర్వహించారు. రామకుప్పంలో పోలీసుస్టేషను సర్కిల్లోని అంబేడ్కర్ విగ్రహానికి టీడీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మునస్వామి, పార్టీ రామకుప్పం మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఆనందరెడ్డి, నరసింహులు, మాజీ ఎంపీపీ ఆంజినేయరెడ్డిలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో నేతలు సీతాపతి, నాగభూషణం, జయశంకర్, శ్రీనివాసులు, నందారెడ్డి పాల్గొన్నారు. ● పట్టణంలోని శివాజీనగర్-రెడ్డివీధి కూడలిలోని అంబేడ్కర్ విగ్రహానికి పోలీసులు పూజలు చేశారు.

అంబేడ్కర్‌కు పూజలు



రొంపిచెర్ల, నవంబరు26: (ఆంధ్రజ్యోతి): మండలంలో రాజ్యాంగ దినోత్సవ వేడుకలు నిర్వ హించారు. భారతరత్న అంబేడ్కర్ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఎంపీడీవో కార్యాలయం వద్ద అధికారులు అంబేడ్కర్ చిత్ర పటానికి పూజలు చేశారు. ఎంపీడీవో మధుసూదన్ రెడ్డి, నాగిశెట్టి శేషయ్య, వెంకటేశు, శివకేశవ, శివకుమార్, మునీంద్ర ఓబులేశు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

30న 'చిలకముక్కు చిన్నోడు' పుస్తకావిష్కరణ

పలమనేరు, నవంబరు26 (ఆంధ్రజ్యోతి) : ఈ నెల 30వ తేదీ శనివారం తెలుగు సాహిత్య సాంస్కృతిక సమితి ఆధ్వర్యంలో డాక్టర్ ఎం.హరికిషన్ రచించిన 'చిలకముక్కు చిన్నోడు' పుస్తకావిష్కరణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు సమితి అధ్యక్షులు తులసినాథం నాయుడు తెలిపారు. పిల్లల్లో ఉత్సాహాన్ని రేకెత్తించే 23 కథలు ఈపుస్తకంలో ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమం పలమనేరు బాలికోన్నత పాఠశాల ఆవరణలో శనివారం ఉదయం 8 గంటలకు ప్రారంభమవుతుందని తెలిపారు.

ఎమ్మెల్సీ కంచర్లకు సన్మానం

గుడుపల్లె, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): కుప్పం టీడీపీ కార్యాలయంలో గుడుపల్లె మండల టీడీపీ నాయకులు, కార్యకర్తలు ప్రభుత్వ విప్‌గా నియమితులైన ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్‌ను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మండలాధ్యక్షుడు బాబు, హేమాంబర్ గౌడు, పాల్గొన్నారు.

భారత రాజ్యాంగం

ప్రజాస్వామ్య దేశాలకు దిక్సూచి



కుప్పం మండలం అడవిబూదుగూరులో విద్యార్థుల ర్యాలీ

కుప్పం, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): బాబా సాహెబ్ అంబేడ్కర్ నేతృత్వంలో రూపొందిన భారత రాజ్యాంగం ప్రపంచ ప్రజాస్వామ్య దేశాలకు దిక్సూచివంటిదని ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, ఏపీఎస్ ఆర్టీసీ వైస్ చైర్మన్ పీఎస్.మునిరత్నం అన్నారు. కుప్పంలో భారత రాజ్యాంగ దినోత్సవాన్ని వివిధ రాజకీయ పార్టీలు, ప్రజాస్వామ్య సంస్థలు మంగళవారం ఘనంగా నిర్వహించాయి. రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకుని కుప్పం ఆర్టీసీ బస్టాండు సర్కిల్లోని అంబేడ్కర్ విగ్రహానికి ఎమ్మెల్సీ కంచర్ల, పీఎస్ఎంలు నివాళ లర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భారత దేశంలో ఎన్నో కులాలు, మతాలు, జాతులు కలిసి మనుగడ సాగిస్తున్నాయంటే అది మన రాజ్యాంగం గొప్పదనమేనన్నారు. అంతటి మహత్తరమైన రాజ్యాంగాన్న మనకు అందించిన అంబేడ్కర్ చిరస్మరణీయుడన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు రాజ్ కుమార్ పాల్గొన్నారు. ● కుప్పం మండల సచివాలయంలో ఎంపీడీవో సాయి లహరి ఆధ్వర్యంలో అంబేడ్కర్ చిత్రపటానికి పూమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ కుప్పం మండల అధ్యక్షుడు ప్రేమ్ కుమార్, ఎన్‌ఆర్‌జీఎస్ అధికారులు, పశువుల వైద్యులు, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు. ● కుప్పం మండలంలోని అడవిబూదుగూరు హరిజనవాడ ఎంపీపీ పాఠశాలలో హెచ్‌ఎం చిట్టిబాబు ఆధ్వర్యంలో విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. ● సామగుట్టపల్లె పాఠశాలలో రాజ్యాంగ దినోత్సవాన్ని నిర్వహించారు. ● జనసేన పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త నరేశ్ ఆధ్వర్యంలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలు వేసి నివాళులర్పించారు.

సమానత్వమే రాజ్యాంగ విధానం


అంబేడ్కర్‌కు నివాళులర్పిస్తున్న తహసీల్దార్ హనుమంతు

చౌడేపల్లె, నవంబరు26:(ఆంధ్రజ్యోతి): సమానత్వమే రాజ్యాంగ విధానమని పలువురు పేర్కొన్నారు. రాజ్యాంగ దినోత్స వాన్ని మంగళవారం మండలంలో ఘనంగా నిర్వహించారు. తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ హను మంతు, ఎంపీడీవో కార్యాలయంలో ఈవోఆర్డీ కృష్ణవేణి, స్థానిక హైస్కూల్లో ఇన్‌చార్జి హెచ్‌ఎం రామకృష్ణలు అంబేడ్కర్ చిత్రపటాలకు పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. హైస్కూల్లో విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు.

బాల్ బ్యాడ్మింటన్‌లో సోమల విద్యార్థుల ప్రతిభ



సోమల, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): పుంగనూరు జోన్ బాల్ బ్యాడ్మింటన్ పోటీల్లో సోమల జడ్పీ హైస్కూల్ విద్యార్థులు విశేష ప్రతిభ చూపినట్లు హెచ్.ఎం.హరినాథ్ తెలిపారు. పెద్దమల్లెల జడ్పీ ఉన్నత పాఠశాలలో ఈ నెల 25న బాలబాలిక విభాగంలో పుంగనూరు జోన్ బాల్ బ్యాడ్మింటన్ పోటీలు జరిగాయన్నారు. ఈ పోటీల్లో సోమల విద్యార్థులు ద్వితీయ స్థానం సాధించారని పీడీ కరుణానిధి తెలిపారు. విద్యార్థులను ఉపాధ్యాయులు జ్యోతీశ్వరుడు, అరుణ, రామాంజులు, షర్మిళబాను తదితరులు అభినందించారు.

భారత రాజ్యాంగం ప్రపంచ దేశాలకు ఆదర్శం


కొలమాసనపల్లి ఉన్నత పాఠశాలలో రాజ్యాంగ దినోత్సవం గురించి విద్యార్థులకు వివరిస్తున్న హెచ్‌ఎం ఈశ్వరప్రసాద్

పలమనేరు, నవంబరు26, (ఆంధ్ర జ్యోతి): పలమనేరులో మంగళవారం రాజ్యాంగ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పలమనేరులోని బీజేపీ కార్యాలయంలో ఆ పార్టీ పట్టణ కన్వీనర్ తాతయ్యనాయుడు అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు ఆవుల హేమంత్‌రెడ్డి, అబ్బూరి రమాదేవి, ఆంజ నేయులు, శివశంకర్‌రెడ్డి, సంజయ్ కుమార్ పాల్గొన్నారు. ● కొలమాసనపల్లి ఉన్నత పాఠశాలలో అంబేడ్కర్ చిత్రపటానికి పూజలు చేశారు. హెచ్‌ఎం ఈశ్వరప్రసాద్, సోషియల్ టీచర్ రవి పాల్గొన్నారు. ● ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేశారు. ప్రిన్సిపాల్ డాక్టర్ పి.వెంకటేశు ఆధ్వర్యంలో విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. అధ్యాపకులు డాక్టర్ చిదం బరం, డాక్టర్ నందీశ్వరయ్య, డాక్టర్ వెంకటేష్ బాబు, డాక్టర్ నాగరత్నంరెడ్డి, పాల్గొన్నారు.

కల్లూరు: పులిచెర్ల మండలం కల్లూరు లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో వీఆర్‌ఆర్ డిగ్రీ కళాశాలలో, జడ్పీ ఉన్నత పాఠశాలలో భారత రాజ్యాంగ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా లయన్స్‌క్లబ్ క్రీడా విభాగం అధ్యక్షులు మహమ్మదలి, హెచ్‌ఎం శ్రీవాణి, లియో క్లబ్ సభ్యులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

టీడీపీ సభ్యత్వ నమోదులో వి.కోట ఫస్ట్

వి.కోట, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): పలమనేరు నియోజకవర్గంలో జరుగుతున్న టీడీపీ సభ్యత్వ నమోదులో వి.కోట మండలం టాప్‌లో నిలిచింది. వి.కోట సెగ్మెంట్ పరిధిలో 9227 సభ్యత్వాలను ఇప్పటివరకు నమోదు చేసినట్లు మండల పార్టీ అధ్యక్షులు రంగనాథ్ తెలిపారు. బైరెడ్డిపల్లె 7973, పెద్దపంజాణి 7087, గంగవరం 4682, పలమనేరు టౌన్ 3764, రూరల్ 1441 మేరకు సభ్యత్వాలు నమోదయ్యాయి. మంగళవారం జవ్వునిపల్లె పంచాయతీ పరిధిలో జరుగుతున్న సభ్యత్వ నమోదును ఆయన పరిశీలించారు. .

వాలీబాల్ విజేత చౌడేపల్లె

చౌడేపల్లె, నవంబరు26:(ఆంధ్రజ్యోతి): పుంగనూరు నియోజకవర్గం జోనల్ క్రీడల్లో చౌడేపల్లె జట్లు విజేతలుగా నిలిచాయి. రెండు రోజులుగా కబడ్డీ, వాలీబాల్ పోటీలు స్థానిక హైస్కూల్లో హోరాహోరీగా జరిగాయి. వాలీబాల్ సీనియర్ బాలుర విభాగంలో చౌడేపల్లె జట్టు విజయం సాధించగా, కందూరు హైస్కూల్ విద్యార్థులు ద్వితీయ స్థానం సాధించారు. జూనియర్ బాలుర కబడ్డీ విభాగంలో చౌడేపల్లె హైస్కూల్ విద్యార్థులు విజయం సాధించగా, పుదిపట్ల హైస్కూల్ విద్యార్థులు ద్వితీయ స్థానంలో నిలిచారు. సీనియర్ బాలికల కబడ్డీ విభాగంలో పుదిపట్ల హైస్కూల్ విద్యార్థులు విజయం సాధించగా, చౌడేపల్లె హైస్కూల్ విద్యార్థులు ద్వితీయ స్థానంలో నిలిచారు. విన్నర్స్‌ను, రన్నర్స్‌ను దాతలు బసవరాజు, పార్థ సారథిలు ట్రోఫీతో పాటు పతకాలను అందించారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత పీడీ రామచంద్ర, పీఈటీ రాజేంద్ర, ఉపాధ్యాయులు మురళి, ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

తెరపైకి మళ్లీ టౌన్ హాల్ నిర్మాణం


మున్సిపల్ అధికారులతో టౌన్ హాల్ విషయంపై చర్చిస్తున్న ఎమ్మెల్యే అమరనాథరెడ్డి

పలమనేరు, నవంబరు26 (ఆంధ్రజ్యోతి): పలమనేరులోని వివిమహల్ రోడ్డు పక్కన మున్సిపల్ టౌన్ హాలు నిర్మాణం మళ్లీ తెరపైకి వచ్చింది. 2019లో ఎమ్మెల్యే అమరనాథరెడ్డి పరిశ్రమల శాఖ మంత్రిగా ఉన్నప్పుడు టౌన్ హాల్ నిర్మాణానికి మత్స్య శాఖకు చెందిన స్థలాన్ని కేటాయించారు. అలాగే నిర్మాణానికి రూ.1.80 కోట్లు మంజూరు చేయించి శంకుస్థాపన చేశారు. తర్వాత వైసీపీ అధికారంలోకి రావడం ఇక్కడ అమరనాథరెడ్డి ఓటమి చెందడం జరిగింది. 2019 ఎన్నికల్లో ఇక్కడ వైసీపీ ఎమ్మెల్యేగా వెంకటేగౌడ గెలిచినా టీడీపీ హయాంలో చేపట్టిన పనులు కొనసాగించ లేదు. ఫలితంగా ఐదేళ్లుగా టౌన్ హాల్ అంశం అటకెక్కింది. పైగా టౌన్ హాల్ నిర్మించకపోగా ఆ స్థలం కోట్ల విలువ చేస్తుందని అక్కడ వాణిజ్య దుకాణాలు నిర్మించాలని వైసీపీ వారు భావించారు. దీంతో ఇక టౌన్ హాల్ నిర్మాణం ఆగిపోయినట్లేనని ప్రజలు నిర్ధారణకు వచ్చారు. ప్రస్తుతం మళ్లీ టీడీపీ అధికారంలోకి రావడంతో పాటు స్థానిక ఎమ్మెల్యేగా అమరనాథరెడ్డి గెలవడంతో ఆయన మంత్రిగా ఉన్నప్పుడు చేసిన పలు అభివృద్ధి సంక్షేమ పథకాలను పూర్తిచేసేందుకు చర్యలు ప్రారంభించారు. ఇందులో భాగంగానే టౌన్ హాల్ నిర్మాణ విషయమై స్థానిక మున్సిపల్ కమిషనర్ రమణారెడ్డి, మున్సిపల్ ఇంజినీరింగ్ అధికారులతో ఎమ్మెల్యే మంగళవారం సమీక్ష చేశారు. ఇందుకు సంబంధించి తయారు చేసిన బ్లూప్రింట్‌ను ఎమ్మెల్యే అమరనాథరెడ్డికి మున్సిపల్ అధికారులు చూపించారు. అందులో కొన్నిమార్పులు చేయాలని అధికారులకు ఎమ్మెల్యే సూచించారు. త్వరలోనే టౌన్ హాల్ నిర్మాణానికి నిధులు మంజూరు చేయించి నిర్మాణం చేపట్టనున్నట్లు అధికారులు తెలిపారు.

అంబేడ్కర్ అందరివాడు


అంబేడ్కర్ విగ్రహం వద్ద మాజీ ఎంపీ రెడ్డెప్ప

పుంగనూరు, నవంబరు26(ఆంధ్రజ్యోతి): రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా పుంగనూరులోని అంబేడ్కర్ విగ్రహానికి పలువురు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. దళితసంఘ నాయకులు, న్యాయవాదులు, వైసీపీ నేతలతో కలిసి చిత్తూరు మాజీ ఎంపీ రెడ్డెప్ప, తదితరులు అంబేడ్కర్‌కు పూలమాలలు వేసి అంజలి ఘటించారు. ఈ సందర్భంగా రెడ్డెప్ప మాట్లాడుతూ అంబేడ్కర్ అందరి వాడని గుర్తుచేశారు. పార్లమెంటులో ఆమోదం పొందితేనే ఎస్సీ వర్గీకరణ జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ అలీంబాషా, దళితసంఘ నాయకులు శ్రీనివాసులు, చంద్ర, వైపీ రమణ, నాగరాజ, రమణ పాల్గొన్నారు. ● బీజేపీ నాయకులు అయూబ్‌ఖాన్, రాజారెడ్డిలు అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ● రాయలసీమ చిల్డ్రన్స్ అకాడమీ పాఠశాలలో డైరెక్టర్ చంద్రమోహన్ రెడ్డి, ఉపాధ్యాయులు, అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ● శుభారాం ప్రభుత్వ డిగ్రీకాలేజీ, బసవరాజ ప్రభుత్వ బాలుర కాలేజీ ఆవరణలో అంబేడ్కర్ చిత్రపటాన్ని ఏర్పాటు చేసి నివాళులర్పించారు. ● అడవినాథునికుంట మోడల్ స్కూల్లో విద్యార్థులకు వ్యాసరచన, క్విజ్ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ప్రిన్సిపల్ డాక్టర్ టీఎస్.రమ తదితరులు అంబేడ్కర్, బాబు రాజేంద్రప్రసాద్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

సర్టిఫికెట్ల ప్రదానం

రొంపిచెర్ల, నవంబరు26: (ఆంధ్రజ్యోతి): భారత రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా మంగళవారం విద్యార్థులకు మండల స్థాయిలో వ్యాసరచన, క్విజ్, పాటలు, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. విజేతలకు ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సరళ సర్టిఫికెట్లు పంపిణీ చేశారు.

'బాస్' ఆధ్వర్యంలో రాజ్యాంగ దినోత్సవం

సదుం, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): 75వ రాజ్యాంగ దినోత్సవాన్ని మంగళవారం భారతీయ అంబేడ్కర్ సేన(బాస్) ఆధ్వర్యంలో సదుంలో ఘనంగా నిర్వహించారు. అన్నమయ్య జిల్లా ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులు పాలకుంట శ్రీనివాసులు నేతృత్వంలో పుంగనూరు నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ మందా సీతాపతి ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకల్లో మండలంలోని పలు ప్రజాసంఘాల నేతలు పాల్గొన్నారు.

సమయపాలన పాటించాలి

పుంగనూరు రూరల్, నవంబరు26(ఆంధ్రజ్యోతి): సచివాలయ సిబ్బంది సమయ పాలన పాటించాలని పుంగనూరు ఎంపీడీవో లీలామాధవి సూచించారు. మంగళవారం మండల పరిధిలోని చంద్రమాకులపల్లె సచివాలయాన్ని ఆమె తనిఖీ చేశారు. సిబ్బంది ఆలస్యంగా విధులకు హాజరుకావడంపై ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజలకు అందుబాటులో ఉండి సమస్యలు పరిష్కరించాలని సూచించారు. ప్రజలతో దురుసుగా ప్రవర్తించినట్లు ఫిర్యాదులు వస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

సారా స్వాధీనం..ఒకరి అరెస్టు

పుంగనూరు రూరల్, నవంబరు26(ఆంధ్రజ్యోతి): సారా స్వాధీనం చేసుకుని ఒకరిని అరెస్ట్ చేసినట్లు పుంగనూరు సీఐ శ్రీనివాసులు తెలిపారు. మంగళవారం నల్లగుట్లపల్లె తాండాకు చెందిన భాస్కర్‌నాయక్ సారాను విక్రయించడానికి పట్టణంలోని ఏటిగడ్డపాళ్యంకు తీసుకువచ్చినట్లు సమాచారం అందింది. ఆ మేరకు దాడులు చేశారు. భాస్కర్‌నాయక్ తప్పించుకున్నాడు. ఏటిగడ్డపాళ్యంకు చెందిన రెడ్డెప్ప కొనుగోలు చేస్తూ వంద లీటర్ల సారాతో పట్టుబడ్డాడు. కేసు నమోదు చేశారు.

పంటల బీమా పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి

రొంపిచెర్ల,నవంబరు26: (ఆంధ్రజ్యోతి): మండలంలోని రైతులు పంటల బీమా పథకాన్ని సద్వి నియోగం చేసుకోవాలని వ్యవసాయధికారి సుధారాణి అన్నారు. మంగళవారం బోడిపాటివారిపల్లె పంచాయతీ పరిధిలోని వేరుశెనగ, వరి పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులతో ఆమె మాట్లాడుతూ వరికి డిసెం బరు 31వరకు, వేరుశెనగకు డిసెంబరు 15వ తేదీ వరకు బీమాచేసుకోవడానికి గడువు ఉందని వివరించారు. వెంకట్రమణ నాయక్, రైతు సేవాకేంద్ర సిబ్బంది పాల్గొన్నారు.

రేపు సీతారాముల కల్యాణం

పుంగనూరు, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): పుంగనూరు కొత్తఇండ్లులోని సునంద నిలయంలో ఈ నెల 28వ తేదీ సాయంత్రం అత్యంత వైభవంగా సీతారాముల కళ్యాణం, శ్రీరామ పట్టాభిషేకం కార్యక్రమాలు జరుగుతాయని బీసీవై పార్టీ అధ్యక్షుడు బి.రామచంద్రయాదవ్ తెలిపారు. 29వ తేదీ సాయంత్రం పుంగనూరు బైపాస్‌రోడ్డులోని శ్రీకృష్ణదేవరాయుల విగ్రహం వద్ద గల ఆర్సీవై ప్రాంగణంలో సాంస్కృతిక కార్యకలాపాలు, కళాకారులచే కార్తీక దీపోత్సవం జరుగుతుందన్నారు. 2వేల మంది దీపాలు వెలిగించవచ్చునని, ఉచితంగా పూజాసామగ్రి అందిస్తామని వివరించారు.

ముద్ర రుణాలు ఇవ్వాలి

పుంగనూరు రూరల్, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): ముద్ర రుణాలను ప్రజలకు విరివిగా అందించాలని పుంగనూరు ఎస్బీఐ బ్యాంకు అధికారులను బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు పి.అయూబ్‌ఖాన్ కోరారు. మంగళవారం స్థానిక ఎస్బీఐలో మేనేజర్, ఇతర అధికారులతో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం సూక్ష్మ, చిన్నతరహా సంస్థల కోసం ముద్ర రుణాల పరిమితిని రూ.10 లక్షల నుంచి రూ.20లక్షలకు పెంచిందని వివరించారు.

30న పార్థీవలింగ పూజ

పుంగనూరు రూరల్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): ఈనెల 30వతేదీ శనివారం మధ్యాహ్నం 2-30గంటలకు అమావాస్య సందర్భంగా పుంగనూరు కోనేరులో పార్థీవలింగ పూజ శాస్త్రోక్తంగా నిర్వహించనున్నట్లు కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయ అర్చకులు రామచంద్ర, రాముస్వా ములు తెలిపారు. కోనేరు ఆవరణలో కార్తీకదీపాలు వెలిగిస్తామని వివరించారు.

80 మందికి ఉచిత వైద్యసేవలు



చిత్తూరు రూరల్, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): అపోలో నర్సింగ్ కళాశాల, ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో మంగళవారం మురకంబట్టులోని రెండవ వార్డు ప్రాంతంలో ఉచిత మెడికల్ క్యాంపు నిర్వహించారు. 80 మందికి ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నర్సింగ్ కళాశాల ప్రిన్స్‌పాల్ జయంతి, వైస్ ప్రిన్స్‌పాల్ డాక్టర్ జింటో మాథ్యూ, డాక్టర్ ఆశోక్‌కుమార్, మహేంద్రనాథ్, మురకంబట్టు పీహెచ్‌సీ వైద్యాధికారి ఆశ పాల్గొన్నారు.

కేసుల ఎత్తివేతపై ఉద్యోగ సంఘ నేతల హర్షం


అసోసియేషన్ నాయకులు

చిత్తూరు రూరల్, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): వాణిజ్య పన్నుల శాఖ సర్వీసెస్ అసోసియేషన్ రాష్ట్ర నాయకుడు సూర్యనారాయణపై కేసులను ఎత్తివేసినందుకు అసోసియేషన్ నాయకులు సీఎం చంద్రబాబుకు, మంత్రి లోకేష్‌కు కృతజ్ఞతలు తెలిపారు. మంగళవారం వాణిజ్య పన్నుల శాఖ కార్యాలయం ఎదుట అసోసియేషన్ నాయకులు భారత రాజ్యాంగ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం రాజ్యాంగానికి లోబడి న్యాయం చేసిందన్నారు. అసోసియేషన్ నాయకులు పూర్ణం, గిరిధర్, ప్రసాద్, సుబ్రమణ్యం, సురేష్‌బాబు. జగదీష్ పాల్గొన్నారు.

పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి: కమిషనర్


ఆయిల్‌బాల్స్‌ను వేస్తున్న నరసింహ ప్రసాద్

చిత్తూరు అర్బన్, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): దోమల నియంత్రణ, పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని నగరపాలక సంస్థ కమిషనర్ నరసింహ ప్రసాద్ అన్నారు. మంగళవారం ఆయన నగరంలోని పలు ప్రాంతాల్లో పర్యటించి పారిశుధ్య పనులను తనిఖీ చేశారు. జానకరాపల్లె వద్ద నిల్వనీటిలో దోమల నియంత్రణలకు ఆయల్‌బాల్స్‌ను వేశారు. మిట్టూరు మస్టర్ పాయింట్ వద్ద పారిశుధ్య కార్మికుల హాజరు నమోదును తనిఖీ చేశారు. . మెసానికల్ మైదానం నుంచి పీవీకేఎన్ డిగ్రీ కళాశాల వరకు ఉన్న రోడ్డు వెడల్పుపై డీఈ కృష్ణ, ఏఈ లోకేష్‌తో మాట్లాడారు.

కొటాల రోడ్డుక మరమ్మతు పనులు


జోడిచింతల - కొటాల రహదారి పనులు

యాదమరి, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రహదారులకు మోక్షం కలుగనుంది. జోడిచింతల నుంచి కొటాల వరకు రోడ్డు మరమ్మతులకు గురైంది. ఆర్అండ్‌బీ అధికారులు స్పందించారు. కొటాల రోడ్డు, జోడిచింతల నుంచి మాదిరెడ్డిపల్లి రోడ్లను గుంతల రహితంగా మార్చేందుకు నిధులు మంజూరయ్యాయి. రోడ్డు మరమ్మతుల పనులు ప్రారంభించారు. జోడిచింతల-పరదరామి అంతర్రాష్ట్ర రహదారి ప్యాచ్ పనులకు రూ.1.35 కోట్లతో మరమ్మతులకు టెండర్ల ప్రక్రియ ప్రారంభంకానుంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రోడ్లకు ప్రాధాన్యం ఇచ్చింది.

సాఫ్ట్‌బాల్ పోటీల్లో విజేతలకు అభినందన



వెదురుకుప్పం, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోను రాణించాలని కార్వేటినగరం మండలం డీఎంపురం జడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎం.కేశవులు అన్నారు. రాష్ట్ర స్థాయి సాఫ్ట్‌బాల్ పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనపరిచిన విద్యార్థులను ఆయన, వ్యాయామ సంచాలకులు తిరుమలరాజు, ఉపాధ్యాయులు అభినందించారు. రాష్ట్రస్థాయి సాఫ్ట్ బాల్ పోటీల్లో జిల్లా జట్టు మూడవ స్థానంలో నిలించిందన్నారు.

జోరుగా తెలుగుదేశం పార్టీ సభ్యత్వ నమోదు


మారేపల్లిలో మొబైల్‌ఫోన్‌లో సభ్యత్వాలను చూపుతున్న నాయకులు,తదితరులు

వెదురుకుప్పం, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): మండలంలో పలు గ్రామ పంచాయతీల్లో మంగళవారం జోరుగా టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని తెలుగుదేశం పార్టీ నాయకులు చేపట్టారు. ఈక్రమంలో మారేపల్లిలో గ్రామ సర్పంచ్ అన్నురాశి,నాయకులతో కలసి పార్టీ సభ్యత్వ నమోదు చేయించారు.

జీవామృతం తయారీపై రైతులకు డెమో



బంగారుపాళ్యం, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): పాలేరులో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా వనరుల కేంద్ర సహాయ వ్యవసాయ సంచాలకులు నాగపద్మిని, ఉపసంచాలకులు ఉమ పాల్గొన్నారు. ఉద్యానశాఖ అధికారి సాగరిక మాట్లాడుతూ మామిడి పూత సమయంతో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పురుగుల మందుల వాడకం గురించి రైతులకు వివరించారు. జీవామృతం తయారీ విధానాన్ని రైతులకు డెమో ఇచ్చారు. వ్యవసాయ విస్తరణాధికారి సాదరయ్య, ఆనందరాజ్, పుష్పాంజలి తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన

వెదురుకుప్పం, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): కార్వేటినగరం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం సైబర్ నేరాలు జరుగుతున్న తీరుపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఎస్ఐ మునికృష్ణ మాట్లాడుతూ రోజురోజుకూ దేశంలో సైబర్ నేరాల బాధితులు ఎక్కువైపోతున్నారన్నారు. కొందరు తీని తద్వారా యువత ఆత్మన్యూనత, కుంగుబాటుకు గురవుతున్నారని తెలిపారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సీతా విజయలురెడ్డి మాట్లాడుతూ అపరిచిత ఫోన్ కాల్స్, మెసేజ్‌ల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు.ఎన్ఎస్ఎస్ యూనిట్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ ధనంజయరెడ్డి, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

దారి ఇబ్బందులు

పెనుమూరు, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): సామిరెడ్డిపల్లి ఎగువ దళితవాడకు నీటిలో వెళ్లాల్సిందే. ఇందుకు మరో మార్గం లేదు. ఎగువ దళితవాడ సమీపంలో రోడ్డుకు ఇరుపక్కల ఎత్తులో పొలాలు ఉన్నాయి. రోడ్డు మధ్యలో ఐదడుగుల లోతులో ఉండటంతో చిన్న వర్షం పడినా అందులో నీరు నిలిచిపోతోంది. దీంతో గ్రామస్తులు పొలం గట్లపై వెళుతున్నారు. ద్విచక్ర వాహన చోదకులు ఇబ్బందులు పడుతున్నారు. రోడ్డుపై మట్టి తోలి నీరు నిలవకుండా చూడాలని కోరుతున్నారు.

గరుడవాహనంపై శ్రీవారి విహారం

సోమల, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): నెల్లిమంద పంచాయతీ బురుజుపల్లెలో కొలువుదీరిన శ్రీదేవి భూదేవి సమేత శ్రీవారి ఆలయ వార్షిక ఉత్సవాలలో భాగంగా స్వామి, అమ్మవార్లను పుష్పపల్లకీలో ఊరేగించారు. తొలుత ఆలయంలోని మూలవిరాట్‌కు విశేష అలంకరణ చేసి ప్రత్యేక అభిషేకపూజలు చేశారు. శ్రీదేవిభూదేవి సమేత శ్రీవారిని పల్లకీలో అలంకరించి ఊరేగించారు. దేవ రెడ్డుకు పూజలు జరిపారు. టీటీడీ అన్న మాచార్య ప్రాజెక్టు కళాకారులు అన్నమయ్య సంకీర్తలు ఆలపించారు.

డ్రంకెన్ డ్రైవ్ కేసులో 22 మందికి జారిమానా

చిత్తూరు అర్బన్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): మద్యం తాగి వాహనాలు నడిపిన 22 మందికి సివిల్‌కోర్టులో జడ్జి జరిమానా విధించారు. సోమవారం ట్రాఫిక్ సీఐ నిత్యబాబు, ఎస్ఐ దసరథరామరాజు, సిబ్బంది కలిసి వివిధ ప్రాంతాల్లో వాహనాల తనిఖీ చేశారు. 22 మంది తాగి సేవించి వాహనాలు నడిపి పోలీసులకు పట్టుబడ్డారు. వారిని మంగళవారం జూనియర్ సివిల్ కోర్టులో హాజరుపరిచారు. జడ్జి ఉమాదేవి రూ.10వేలు వంతున జరిమానా వేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

కార్యదర్శుల సమస్యలు పరిష్కరించండి

పూతలపట్టు, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): పంచాయతీ కార్యదర్శుల సమస్యలు పరిష్కరించాలంటూ కార్యదర్శులు ఎంపీడీవో నాగరాజుకు మంగళవారం వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో మండలంలోని పలువురు పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

బంగారమ్మకు ప్రత్యేక పూజలు

వెదురుకుప్పం, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): కార్వేటినగరంలోని గ్రామ దేవత బంగారమ్మకు మంగళవారం విశేష పూజలు నిర్వహించారు. అమ్మవారికి పాలు, పెరుగు, తేనె, హరిద్రవం, పసుపు, కుంకుమ అభిషేకం చేశారు. రాహుకాలం పూజలు, కుంకుమార్చనలు నిర్వహించారు. భక్తిశ్రద్ధలతో ఆలయ ప్రాంగణంలో పొంగళ్లు, నైవేద్యం సమర్పించారు.

నేడు పెనుమూరు మండల సమావేశం

పెనుమూరు, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): మండల సర్వసభ్య సమావేశం బుధవారం ఉదయం గంటలకు నిర్వహించనున్నారు. ఎంపీడీవో నీలకంఠేశ్వర్‌రెడ్డి ఈమేరకు ఒక ప్రకటనలో తెలిపారు. మండల స్థాయి అన్నీ శాఖల అధికారులు సమగ్ర సమాచారంతో తప్పనిసరిగా పాల్గొనాలన్నారు.

మంత్రి లోకేష్‌తో ఎమ్మెల్యే సీకే బాబు భేటీ



చిత్తూరు సిటీ, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌ను మాజీ ఎమ్మెల్యే సీకే బాబు మర్యాద పూర్వకంగా కలిశారు. మంగళవారం మంగళగిరిలోని సీకే బాబు, ఆయన కుమారుడు సీకే సాయికృష్ణ కలసి దుశ్శాలువ సత్కరించారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై కాసేపు చర్చించారు.

వెలుగు సమైక్య సంఘాల ర్యాలీ



వెదురుకుప్పం, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): జెండర్ ఆధారిత హింసకు వ్యతిరేకంగా కార్వేటినగరం మండల వెలుగు సమైక్య, డీఆర్‌డీఏ ఏపీఎం కవిత ఆధ్వర్యంలో మంగళవారం ర్యాలీ నిర్వహించారు. ఆడవారి మీద హింస, బాల్య వివాహాలు, గృహ హింస, ఈవ్‌టీజింగ్‌ను వ్యతిరేకిస్తూ చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ర్యాలీ నిర్వహించారు. వెలుగు ఉద్యోగులు, మహిళా సంఘాల సభ్యులు, ఈసీ మెంబర్లు, సీసీలు తదితరులు ప్రతిజ్ఞ చేశారు.

భారీ వర్ష సూచన నేపథ్యంలో కంట్రోల్ రూమ్

నగరి, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): భారీవర్ష సూచన నేపథ్యంలో ప్రత్యేక కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు తహసీల్దారు రవికుమార్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. బుధవారం నుంచి ఈనెల 29 వరకు భారీ వర్షాలు కురిసే సూచనలు ఉన్న నేపథ్యంలో ముందస్తు జాగ్రత్తలు తీసుకున్నామన్నారు. 27న 9493317125, 28న 9704623597, 29న 6305312141 నంబరుకు సంప్రదించవచ్చని సూచించారు.

అలరించిన మాక్ పార్లమెంట్

నగరి, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎం.కొత్తూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రాజ్యాంగ దినోత్సవాన్ని పురష్కరించుకుని పాఠశాలలో విద్యార్థులు మంగవారం నిర్వహించిన మాక్ పార్లమెంటు ఆకట్టుకుందింది. పాఠశాలలో టేబుళ్లకు మంత్రుల శాఖలను అంటించి ప్రధానమంత్రి, కేంద్ర మంత్రులుగా పార్లమెంటులో నిర్ణయాలు తీసుకోవడం లాంటి అంశాలను వారు ప్రదర్శించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు గీతాకుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మికతతో సమాజానికి శాంతి


పరిపూర్ణానంద స్వామిని కలిసిన భక్తులు.

చిత్తూరు కల్చరల్, నవంబరు26 (ఆంధ్రజ్యోతి): స్థానిక తపోవనం హైస్కూల్‌ను ఏర్పేడు పీఠాధిపతి పరిపూర్ణానంద స్వామి మంగళవారం సందర్శించారు. పాఠశాల ఆవరణలోని అతిథి గృహంలో ఆయన భక్తులకు ఆశీర్వదించారు. ఈసందర్భంగా స్వామీజీ మాట్లాడుతూ ఆధ్యాత్మికత అలవర్చుకుంటే సమాజం శాంతి సౌభాగ్యాలతో విలసిల్లుతుందన్నారు. జీజేపి నాయకులు అట్లూరి శ్రీనివాసులు, వై ష్ణవి బుక్స్ అధినేత శ్రీనివాసులు, ఎం. శ్రీనివాసన్, వాసుస్వామి, ముత్యాలు శెట్టి తదితరులు పాల్గొన్నారు

జగన్ వ్యాఖ్యలు విడ్డూరం: టీడీపీ

యాదమరి, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): మాజీ ముఖ్యమంత్రి జగన్ మతిలేక మాట్లాడుతున్నారని జిల్లా తెలుగు యువత అధికారప్రతినిధి వల్లేరు అమరనాథ నాయుడు విమర్శించారు. విద్యార్థులు ఫీజు రీయింబర్స్‌మెంట్ లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని జగన్ వ్యాఖ్యానించడాన్ని ఆయన మంగళవారం ఖండించారు. జగన్ హాయంలో విద్యా దీవెన పథకం కింద రూ.3200 కోట్ల బకాయిలు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు రూ.2456 కోట్లు బకాయిలు పెట్టారన్నారు. విద్యార్థులకు రూ.6వేల కోట్లు ఇవ్వకుండా చేసిన ఘనత జగనోకే దక్కిందన్నారు. కూటమి ప్రభుత్వం ఈ సమస్యను పరిష్కరించిందని గుర్తించకుండా మాట్లాడటం తగదన్నారు.

30న పుస్తకావిష్కరణ

పలమనేరు, నవంబరు26 (ఆంధ్రజ్యోతి) : ఈ నెల 30వ తేదీ శనివారం తెలుగు సాహిత్య సాంస్కృతిక సమితి ఆధ్వర్యంలో డాక్టర్ ఎం.హరికిషన్ రచించిన 'చిలక ముక్కు చిన్నోడు' పుస్తకావిష్కరణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు సమితి అధ్య క్షులు తులసినాథం నాయుడు తెలిపారు. పిల్లల్లో ఉత్సాహాన్ని రేకెత్తించే 23 కథలు ఈపుస్తకంలో ఉన్నాయన్నారు.

రైతు సేవాకేంద్రం మార్పునకు గ్రీన్‌సిగ్నల్

●ఫలించిన సర్పంచ్ కృషి ●ఎమ్మెల్యే చొరవతో ఉత్తర్వులు జారీ చేసిన జిల్లా కలెక్టర్


కె. నాశంపల్లెలో కమ్యూనిటీహాలు భవనానికి ముస్తాబు

గంగాధరనెల్లూరు, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): కె. నాశంపల్లెలో రైతు సేవాకేంద్రం ఏర్పాటుచేయలనే స్థానికుల ఆకాంక్ష నెరవేరుతోంది. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో సచివాలయం, వెల్‌నెస్ క్లీనిక్, రైతు భరోసా కేంద్రాలు కలిజవేడులో ఏర్పాటు చేశారు. ఈ పంచాయతీలో ఎక్కువగ్రామాలకు దగ్గరగా ఉన్న కె. నాశంపల్లె లో వెల్‌నెస్ క్లీనిక్, రైతుసేవాకేంద్రం ఏర్పాటుచేయాలని సర్పంచ్ నీలావతి గతంలో డిప్యూటీ సీఎం నారాయణస్వామిని కలిసి పలుసార్లు కోరినా ఫలితం లేకపోయింది. కలిజవేడులోనే వైసీపీకి చెందిన ఓ వ్యక్తి రేకుల షెడ్‌లో అద్దె ప్రాతిపదికపై రైతుసేవాకేంద్రం ఉండేది. ఇటీవల ఈ విషయాన్ని కలిజవేడు సర్పంచ్ నీలావతి ఎమ్మెల్యే, డాక్టర్ థామస్ దృష్టికి తీసుకువచ్చారు. దీంతో ఎమ్మెల్యే థామస్ స్పందించి కలెక్టర్‌తో చర్చించారు. ఆయన స్పందించి రైతుసేవాకేంద్రాన్ని గ్రామంలోని కమ్యూనిటీ హాలు భవనానికి మార్చేందుకు అంగీకరించారు. ఈనేపథ్యంలో కె.నాశంపల్లెలోని కమ్యూనిటీ హాలు భవనానికి రంగులు వేస్తున్నారు. త్వరలోనే ఈ కేంద్రాన్ని ప్రారంభించనున్నారు. ఈ నిర్ణయం వల్ల అద్దె భారం తప్పుతుంది.

ఘనంగా రాజ్యాంగ దినోత్సవం

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌కు నేతలు,అధికారులు నివాళి



చిత్తూరు నగరపాలక సంస్థ కార్యాలయంలో- ఎస్ఆర్‌పురం మండల పరిషత్ కార్యాలయంలో ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు,సిబ్బంది

చిత్తూరు రూరల్, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): జిల్లాపరిషత్ కార్యాలయంలో మంగళవారం రాజ్యాంగ దినోత్సవాన్ని నిర్వహించారు. సమావేశ మందిరంలో అంబేడ్కర్ చిత్రపటానికి సీఈవో రవికుమార్‌నాయుడు పూలమాల వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో జడ్పీ అధికారలు, ఉద్యోగులు పాల్గొన్నారు. ●అంబేడ్కర్ విగ్రహానికి దళిత హక్కుల పోరాట సమితి నాయకులు పూలమాల వేసి నివాళి అర్పించారు. సమితి నాయకులు నాగరాజు, దామోదరం, జయకుమారి, విజయకుమార్, రమాదేవి, రఘు తదితరులు పాల్గొన్నారు. ●గంగాధరనెల్లూరు: ఎంపీడీవో మీటింగ్ హాలులో డాక్టర్ అంబేడ్కర్ చిత్రపటానికిఎంపీడీవో హరిప్రసాద్‌రెడ్డితో పాటు అధికారులు కలిసి పూలమాలవేసి నివాళులు అర్పించారు. ●ఐరాల: ప్రభుత్వ కళాశాల విద్యార్థులు ప్రతిజ్ఞ చేశారు. ప్రిన్సిపాల్ రెడ్డిరామరాజు మాట్లాడారు. ప్రభుత్వాసుపత్రి సిబ్బంది వీఎస్.అగ్రహారంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద పూలమాలలు వేశారు.●పాలసముద్రం: ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహించిన వ్యాసరచన పోటీల విజేతలకు ఎంపీడీవో కృష్ణమహేష్‌రెడ్డి బహుమతులు పంపిణీ చేశారు. ●నగరి: బస్టాండులోని అంబేడ్కర్ విగ్రహానికి ఆల్ ఇండియా అంబేడ్కర్ యువజన సంఘం జాతీయ కార్యదర్శి గోవిందస్వామి పూలదండలు వేసి నివాళ్లర్పించారు. ●చిత్తూరు అర్బన్: జిల్లా పోలీసు కార్యాలయంలో అంబేడ్కర్ చిత్రపటానికి ఆపరేషన్స్ ఏఎస్పీ రాజశేఖర్‌రాజు హాజరై పూలమాల వేసి నివాళులు అర్పించారు. ●యాదమరి: ఎంపీడీవో కార్యాలయం, కె. గొల్లపల్లె, 14 కండ్రిగ ఉర్దూ హై స్కూల్, యాదమరి ఉన్నత పాఠశాల పీఈఎస్ పబ్లిక్ పాఠశాలల్లో మంగళవారం విద్యార్థులచే రాజ్యాంగ దినోత్సవాన్ని నిర్వహించారు. ●చిత్తూరు అర్బన్: నగరపాలక కార్యాలయంలో అంబేడ్కర్ చిత్రపటానికి మేయర్ అముద, కమిషనర్ నరసింహ ప్రసాద్, సహాయ కమిషనర్ ప్రసాద్‌లు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

అభివృద్ధి పనులకు స్టాండింగ్ కమిటీ ఆమోదం


స్టాండింగ్ కమిటీ సమావేశంలో పాల్గొన్న సభ్యులు

చిత్తూరు అర్బన్, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): నగరపాలక సంస్థ స్టాండింగ్ కమిటీ సమావేశం మంగళవారం నగరపాలక కార్యాలయంలోని సమావేశపు హాలులో జరిగింది. మేయర్ అముద, కమిషనర్ నరసింహ ప్రసాద్, కమిటీ సభ్యులు డిప్యూటీ మేయర్ రాజేష్‌కుమార్‌రెడ్డి, నిర్మల, శశికుమార్, సుష్మా, అశోక్‌లు పాల్గొన్నారు. అజెండా అంశాలపై చర్చించి ఆమోదించారు. ఆఫీసర్స్ లేన్‌లో సిమెంటు రోడ్డు నిర్మాణానికి అ రూ. 12.80 లక్షలను సాధారణ నిధుల నుంచి ఖర్చు చేయడానికి, బాపూజీ నగర్‌లో రూ. 14.80 లక్షలు, 9వ వార్డులోని నలంద నగర్‌లో రూ. 16.20 లక్షలు, మైత్రి నగర్‌లో రూ. 26.10 లక్షలను సీసీ రోడ్ల నిర్మాణానికి 2024-25 సాధారణ నిధుల నుంచి మొత్తం వ్యయం చేయడానికి నిర్ణయించారు. సమావేశంలో సహాయ కమిషనర్ ప్రసాద్, ఎంఈ వెంకట్రామిరెడ్డి, మేనేజర్ వర్మ తదితరులు పాల్గొన్నారు.

కాంతారావు మృతికి నాయకుల సంతాపం


కాంతారావుకు నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే మురళి,తదితరులు

పూతలపట్టు, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): డీసీసీబీ మాజీ డైరెక్టర్ కాంతారావు మృతదేహానికి పలువురు నాయకులు సంతాపం వ్యక్తం చేశారు. పూతలపట్టు మండలం పేటఅగ్రహారం గ్రామానికి చెందిన ఈయన కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ సోమవారం సాయంత్రం మృతి చెందారు. మంగళవారం స్వగ్రామంలో అంత్యక్రియలు నిర్వహించారు. కాంతారావు మృతికి చిత్తూరు, చంద్రగిరి, పూతలపట్టు, పలమనేరు ఎమ్మెల్యేలు గురజాల జగన్మోహన్, పులివర్తి నాని, మురళీమోహన్, అమర్‌నాథ రెడ్డితో పాటు నాయకులు యువరాజు నాయుడు, దొరబాబు చౌదరి, గంగారపు గోపి, ప్రతాపనేని చంద్రమౌళి, బాబురావు, గణపతి నాయుడు, శేషాద్రినాయుడు, చంద్రబాబు, కార్తికేయ చౌదరితో పాటు నియోజకవర్గాల నాయకులు సంతాపం ప్రకటించారు. మృతదేహాన్ని నాయకులు సందర్శించి నివాళులర్పించారు.

సారా తయారీ స్థావరాలపై విస్తృత దాడులు


సారా ఊట ధ్వంసం చేసిన డ్రమ్ములతో ఎక్సైజ్ అధికారులు

చిత్తూరు సిటీ, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): సారా తయారీ స్థావరాలపై ఎక్సైజ్ అధికారులు మంగళవారం దాడిచేశారు. 2200 లీటర్ల ఊటను ధ్వంసం చేసినట్లు అర్బన్ ఎక్సైజ్‌సీఐ శ్రీహరి రెడ్డి చెప్పారు. గుడిపాల మండలం రాసనపల్లె పరిసరాల్లో ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్, టాస్క్ ఫోర్స్ సిబ్బంది విస్తృతంగా దాడులు చేశాయన్నారు. రూరల్ మండలం బండపల్లిలో అక్రమంగా కేరళ మద్యం విక్రయిస్తున్న మోహన్‌ను అదుపులోకి తీసుకుని 12 మద్యం బాటిళ్ళు స్వాధీనం చేసుకున్నామన్నారు. కాగా సారా తయారీ, రవాణా, విక్రయాల వల్ల జరిగే అనర్థాల గురించి మంగళవారం గుడిపాల మండలం పేయనపల్లిలో శ్రీహరి రెడ్డి వివరించారు. జీవనోపాధికి ప్రభుత్వం అనేక రకాలుగా చేయూతనిస్తుందని చెప్పారు. బ్యాంకుల ద్వారా రుణాలిప్పించి గౌరవంగా బతికేందుకు అవకాశం కల్పిస్తారన్నారు.

అంగన్‌వాడీ పోస్టులకు ఇంటర్వ్యూలు



నగరి, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గ స్థాయిలో ఖాళీగా ఉన్న మినీ అంగన్‌వాడీ కార్యకర్త, సహాయకురాలు పోస్టులకు ఆర్డీవో బవానీశంకరి ఆధ్వర్యంలో మంగళవారం ఇంటర్వ్యూలు నిర్వహించారు. గుండ్రాజుకుప్పం దళితవాడలో అంగన్‌వాడీ కార్యకర్త, బుగ్గ అగ్రహారంలో హెల్పర్, నింద్ర మండలం శ్రీరామపురంలో మిని కార్యకర్త పోస్టులకు ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఈ మూడు పోస్టులకు అయిదుగురు అభ్యర్థులు హాజరయ్యారు. ఐసీడీఎస్ పీడీ హైమావతి, అర్బన్ హెల్త్ సెంటర్ వైద్యులు ఎయిల్అరసన్, సీడీపీవోలు కృష్ణవేణి, జయంతిలు ఎంపికలో పాల్గొన్నారు.

గంగమ్మ గుడికి దారిపై ఆర్‌డీవో ఆరా

గంగాధరనెల్లూరు, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వరత్తూరులోని గంగమ్మగుడికి వెళ్ళే దారి అంశం వివాదస్పదం కావడంతో ఆర్‌డీవో శ్రీనివాసులు మంగళవారం వచ్చి పరిశీలించారు. స్థానికుల అభ్యంతరంపై ఆరా తీశారు. వరత్తూరు పంచాయతీలో పరిధిలోని చిత్తూరు- తచ్చూరు హైవే రోడ్డు నిర్మాణంలో బోర్లు, బోరుబావులు, వ్యవసాయ పరమైన పైపులైన్ల ఏర్పాటులో భూములు కోల్పోయిన వారితో కూడా ఆర్‌డీవో మాట్లాడారు. అనంతరం ఆర్‌డీవో తహసీల్దార్ ఆఫీస్‌ను తనిఖీ చేశారు. తహసీల్దార్ చంద్రశేఖర్, డీటీ తులసీరామ్, వీఆర్వోలు సుబ్రమణ్యం, పాతిమా తదితరులు పాల్గొన్నారు.

వాలీబాల్ టోర్నీ విజేత చౌడేపల్లె

చౌడేపల్లె, నవంబరు26.(ఆంధ్రజ్యోతి): పుంగనూరు నియోజకవర్గం జోనల్ క్రీడల్లో చౌడేపల్లె జట్లు విజేతలుగా నిలిచాయి. రెండు రోజులుగా కబడ్డీ, వాలీబాల్ పోటీలు స్థానిక హైస్కూల్లో హోరాహోరీగా జరిగాయి. వాలీ బాల్ సీనియర్ బాలుర విభాగంలో చౌడేపల్లె జట్టు విజయం సాధించగా, కందూరు హైస్కూల్ విద్యార్థులు ద్వితీయ స్థానం సాధించారు. జూనియర్ బాలుర కబడ్డీ విభాగంలో చౌడేపల్లె హైస్కూల్ విద్యార్థులు విజయం సాధించగా, పుదిపట్ల హైస్కూల్ విద్యార్థులు ద్వితీయ స్థానంలో నిలిచారు. సీనియర్ బాలికల కబడ్డీ విభాగంలో పుదిపట్ల హైస్కూల్ విద్యార్థులు విజయం సాధించగా, చౌడేపల్లె హైస్కూల్ విద్యార్థులు ద్వితీయ స్థానంలో నిలిచారు. విన్నర్స్‌ను, రన్నర్స్‌ను దాతలు బసవరాజు, పార్థ సారథిలు ట్రోఫీతో పాటు పతకాలను అందించారు. ఈ కార్య క్రమంలో విశ్రాంత పీడీ రామచంద్ర, పీఈటీ రాజేంద్ర, ఉపాధ్యాయులు మురళి, ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

కాపు సంఘం పార్లమెంటరీ అధ్యక్షుడిగా విజయబాబు



శ్రీరంగరాజపురం, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): కొత్తపల్లె మిట్ట మాజీ సర్పంచ్ విజయబాబును జిల్లా పార్లమెంటరీ కాపు సంఘం అధ్యక్షుడిగా, నియమించినట్లు ఆ సంఘం వ్యవస్థాపకుడు కర్ల మురళీకృష్ణ నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. విజయబాబు మాట్లాడుతూ నియోజకవర్గంలో కాపు సంఘానికి అభివృద్ధికి కృషి చేస్తానన్నారు.

ఇంటింటా ఎన్‌సీడీ సర్వే



విజయపురం, నవంబర్ 26(ఆంధ్రజ్యోతి): ఇంటింటా ఎన్‌సీడీ సర్వే నిర్వహిస్తున్నట్లు వైద్యాధికారి సోమశేఖర్ తెలిపారు. మండలంలో నాన్ కమ్యునకబుల్ డీసీస్‌లో భాగంగా గుండె, క్యాన్సర్, మధుమేహం వంటి వ్యాధుల గురించి సర్వే చేస్తున్నామన్నారు. మంగళవారం మండలంలోని విజయపురం, జగన్నాథపురంలో ఇంటిటా సర్వే నిర్వహించారు. ఏఎన్ఎంలు శాంతి, పద్మ, యశోద, ఎంఎల్‌హెచ్‌పీ శివగామి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

టీడీపీ జీవిత కాల సభ్యత్వం స్వీకరణ


కిషన్‌చంద్

వెదురుకుప్పం, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): మండలం బొమ్మయ్యపల్లె గ్రామ పంచాయతీ తెట్టుగుంటపల్లికి చెందిన తెలుగు యువత నియోజకవర్గ అధ్యక్షుడు గురుసాల కిషన్‌చంద్ తెలుగుదేశం పార్టీ జీవితకాల సభ్యత్వం తీసుకున్నారు. ఆయనను పార్టీ నాయకులు అభినందించారు.

బాలగురునాథస్వామి కొలువు ఉత్సవాలు

గుడిపాల, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): వసంతాపురం పంచాయతీ దళవాయిపల్లెలో మంగళవారం అంకాళపరమేశ్వరి సమేత బాలగురునాథ స్వామి కొలువు మహోత్సవాన్ని గ్రామస్థులు వైభవంగా నిర్వహించారు. ఉదయం స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు చేశారు. మధ్యాహ్నం అన్నదానం చేపట్టారు. కార్యక్రమానికి పక్క రాష్ట్రాలైన తమిళనాడు, కర్ణాటక నుంచి భక్తుల తరలివచ్చారు.

బాల్ బ్యాడ్మింటన్‌లో సోమల విద్యార్థుల ప్రతిభ

సోమల, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): పుంగనూరు జోన్ బాల్ బ్యాడ్మింటన్ పోటీల్లో సోమల జడ్పీ హైస్కూల్ విద్యార్థులు విశేష ప్రతిభ చూపినట్లు హెచ్.ఎం.హరినాథ్ తెలిపారు. పెద్దమల్లెల జడ్పీ ఉన్నత పాఠశాలలో ఈ నెల 25న బాలబాలిక విభాగం లో పుంగనూరు జోన్ బాల్ బ్యాడ్మింటన్ పోటీలు జరిగాయన్నారు.

సారా స్వాధీనం..ఒకరి అరెస్టు

పుంగనూరు రూరల్, నవంబరు26(ఆంధ్రజ్యోతి): సారా స్వాధీనం చేసుకుని ఒకరిని అరెస్ట్ చేసినట్లు పుంగనూరు సీఐ శ్రీనివాసులు తెలిపారు. మంగళవారం నల్లగుట్లపల్లె తాండాకు చెందిన భాస్కర్‌నాయక్ సారాను విక్రయించడానికి పట్టణంలోని ఏటిగడ్డపాళ్యంకు తీసుకువచ్చినట్లు సమాచారం అందింది. ఆ మేరకు దాడులు చేశారు. భాస్కర్‌నాయక్ తప్పించుకున్నాడు. ఏటిగడ్డపాళ్యంకు చెందిన రెడ్డెప్ప కొనుగోలు చేస్తూ వంద లీటర్ల సారాతో పట్టుబడ్డాడు.